ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 18.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఇది హత్యే..!

'ముక్కలు ముక్కలైన పుర్రె..!
తలపై గట్టిగా కొట్టినందుకేనా..?
ఇతర భాగాలలో స్వల్ప గాయాలే..?
అందుకే ఇది హత్య కావచ్చు..'
సతీష్ కుమార్ మృతదేహానికి సీటీ స్కాన్, పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం వైద్యులు, పోలీసు అధికారులు ఈ అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది.





సతీష్ సతీమణి.. దిక్కుతోచని స్థితి





సత్యం వధ..?

టీటీడీ మాజీ ఏవీఎస్ఓ సతీష్ కుమార్ అనుమానాస్పద మృతి

● పేదింటి బిడ్డ

కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన ఓ సాధారణ కుటుంబంలో జన్మించిన సతీష్ కుమార్.. కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. ఎస్ఐ, సీఐ స్థాయికి తన ప్రతిభ, నిజాయతీతో ఎదిగారని ఆయన స్నేహితులు అంటున్నారు. ఆయన మరణంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సంఘటనా స్థలం వద్ద, సర్వజన వైద్యశాలలో ఆయన భార్య, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు బోరున విలపిస్తూ కనిపించారు.



పోస్టుమార్టం గదికి వెళుతున్న సూపరింటెండెంట్

రంగంలోకి 15 బృందాలు

పరకామణి కేసులో కీలకమైన పోలీసు అధికారి అనూహ్య మరణం కావడంతో ప్రభుత్వం, పోలీసు శాఖ అప్రమత్తమయ్యాయి. దర్యాప్తును వేగవంతం చేశాయి. రైల్వే, సివిల్, సీఐడీ పోలీసులు సుమారు 15 బృందాలుగా రంగంలోకి దిగాయి.



తమ్ముడి ఆక్రందన

పరకామణిలో చోరీ కేసులో కీలక ఆధారం సతీష్

ఆ కేసు విచారణకు గుంతకల్లు నుంచి తిరుపతికి పయనం

గమ్యం చేరకనే ముగిసిన పోలీసు అధికారి ప్రయాణం

తాడిపత్రి మండలం కోమలి వద్ద రైల్వే ట్రాక్ పక్కన మృతదేహం

తిరుమల తిరుపతి దేవస్థానంలో అసిస్టెంట్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా సేవలు అందించిన సతీష్ కుమార్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. గుంతకల్లులో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనకు టీటీడీ పరకామణిలో చోరీ కేసు విచారణకు రావాలని పిలుపు వచ్చింది. దీంతో రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో గుంతకల్లు నుంచి గురువారం రాత్రి 12 గంటల సమయంలో తిరుపతికి బయలుదేరారు. గమ్యం చేరకనే, శుక్రవారం ఉదయాన తాడిపత్రి సమీపంలోని జుటూరు-కోమలి స్టేషన్ల మధ్య.. రైల్వే ట్రాక్ పక్కన అచేతనంగా కనిపించారు. పరకామణిలో చోరీ జరిగినట్లు ఆయన చేసిన ఫిర్యాదు ఆధారంగా వైసీపీ హయాంలో కేసు నమోదైంది. ఆ కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేశారు. దీనిపై కొందరు కోర్టును ఆశ్రయించడంతో కేసు రీ ఓపెన్ అయింది. సీఐడీ దర్యాప్తు జరుగుతోంది. ఈ కేసులో కీలక ఆధారమైన పోలీసు అధికారి అనూహ్య మరణంతో 'సత్యం వధ' జరిగిందనే అనుమానాలు తలెత్తుతున్నాయి. రైలులో తెల్లవారుజామున 2 నుంచి 3 గంటల మధ్య అనుమానాస్పద సంఘటన జరిగినట్లు భావిస్తున్నారు. డీఐజీ షిమోషి, ఎస్పీ సతీష్ కుమార్ సహా పలువురు అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు కోసం పదిహేనుదాకా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

(సమగ్ర వివరాలు మెయిన్‌లో..)



రైల్వే ట్రాక్ పక్కన సతీష్ కుమార్ మృతదేహం



విలపిస్తున్న భార్య, బంధువులు

కలగానే.. కాలేజీ..



● కూడేరులో జూనియర్ కళాశాల లేక విద్యార్థుల అవస్థలు
● నిత్యం జిల్లా కేంద్రానికి పరుగులు
● బస్సులు దొరక్క తిప్పలు
● ఆర్థిక భారంతో చదువు మానేస్తున్న పలువురు (7లో...)

జనవరి 10 వరకు పంటలకు నీరు

● తరువాత తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్లు అమర్చే పనులు
● రబీకి సాగు నీరు ఉండదు
● ఐసీసీ సమావేశంలో తీర్మానం

బళ్లారి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నుంచి పంట కాలువలకు జనవరి 10వ తేదీ వరకు నీరు వదిలేలా ఐసీసీ సమావేశంలో నిర్ణయించారు. పంట కోతలు పూర్తయ్యే వరకు వదలాలని తీర్మానించారు. శుక్రవారం బెంగళూరులోని నీటి పారుదల శాఖ భవనంలో జలవనరుల శాఖ, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఐసీసీ కమిటీ చైర్మన్ మంత్రి శివరాజ్ తంగడిగే అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. తుంగభద్ర బోర్డులోని కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల ఇంజనీర్లు, బోర్డు చైర్మన్‌తోపాటు బళ్లారి, సిరుగుప్ప, కంప్లి, కొప్పళ, విజయనగర, రాయచూరు ఎమ్మెల్యేలు, మంత్రులు నాగేంద్ర, గణేష్, బోసురాజు, రాఘవేంద్ర హిత్నాల్, రైతు సంఘం నాయకులు హాజరయ్యారు. తుంగభద్ర జలాశయంలో శుక్రవారానికి 75.989 టీఎంసీల నీరు నిల్వ ఉందనీ, ప్రసుత్తం డ్యాం ఆయకట్టులో పంటను కాపాడేందుకు నీటిని వినియోగించేలా తీర్మానించారు. జనవరి నాటికి డ్యాం పరిధిలో ఉండే అన్ని కాలువలకు నీరు వదలాలని నిర్ణయించారు. ఇందులో ఇప్పటివరకూ ఆంధ్ర కోటా కింద దిగువ, ఎగువ కాలువలకు వదిలిన నీరు.. ఇంకా ఇవ్వాల్సిన దానికి సంబంధించి లెక్కలు వేశారు. సమావేశంలో రైతు సంఘం నాయకుడు.. రబీ పంటలకు నీరు వదలాలని కోరారు. దీనిపై డిప్యూటీ సీఎం, జలవనరుల శాఖ మంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ.. జనవరి 10 వరకూ అన్ని కాలువలకు నీరు వదులుతామన్నారు. తరువాత తాగునీటి కోసం నిల్వ చేస్తామన్నారు. క్రస్ట్ గేట్లు అమర్చే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. రైతులు, రైతు సంఘం నాయకులు పరిస్థితిని అర్థం చేసుకోవాలని సూచించారు. డ్యాంలో నీరు అలాగే ఉంచితే క్రస్ట్ గేట్లు అమర్చడం సాధ్యం కాదన్నారు. ఈసారి క్రస్ట్ గేట్లు అమర్చకపోతే వచ్చేఏడాది జలాశయానికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉన్నందున జనవరి నాటికి నీరు వదిలేసి, క్రస్ట్ గేట్లు అమర్చుతామని తేల్చిచెప్పారు.



ఐసీసీ సమావేశంలో మాట్లాడుతున్న కర్ణాటక జలవనరుల శాఖ మంత్రి డీకే శివకుమార్, ఐసీసీ చైర్మన్ శివరాజ్‌తంగడిగే, హాజరైన ఎమ్మెల్యే నాగేంద్ర, ఇతర ఎమ్మెల్యేలు

19న హెరిటేజ్ వాక్ : కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 19 హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. అదే రోజు నుంచి వరల్డ్ హెరిటేజ్ వారోత్సవాలు ఉంటాయన్నారు. దీనిపై శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ... ఈనెల 19న కలెక్టరేట్ నుంచి పీఎస్కే మ్యూజియం వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించాలన్నారు. 20న పీఎస్కే మ్యూజియంలో నాణేలు, స్టాంపుల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలన్నారు. 21న పద్య పఠన పోటీలు, 22న వ్యాస రచనతో పోస్టర్ తయారీ, 23న మినియేచర్ ఆర్ట్ క్రాఫ్ట్, 24న పీఎస్కే మ్యూజియంలో జిల్లా సంప్రదాయ వంటకాల తయారీ, 25న కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ముగింపు కార్యక్రమం ఉంటాయన్నారు. అందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో పురాతత్వ శాఖ ఏడీ స్వామినాయక్, డీఈఓ ప్రసాద్‌బాబు, నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి పాల్గొన్నారు.



అర్ధనారీశ్వర అలంకరణలో స్వామి

అర్ధనారీశ్వరుడు బుగ్గరామలింగేశ్వరుడు

తాడిపత్రి పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం పురస్కరించుకొని శుక్రవారం బుగ్గరామలింగేశ్వరుడు అర్ధనారీశ్వర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

- ఆంధ్రజ్యోతి, తాడిపత్రి

ఎంత డ్రా చేశారు ?

● పశుసంవర్ధక శాఖలో నిధుల స్వాహాపై వివరాల సేకరణ
● కీలక సమాచారం సేకరించిన స్టేట్ ఆడిట్ బృందం
● రాష్ట్ర డైరెక్టర్‌కు నివేదిక ● ముగిసిన విచారణ

అనంతపురం అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలో జరిగిన రూ.కోటికిపైగా నిధుల స్వాహాపై స్టేట్ ఆడిట్ బృందం విచారణ ముగిసింది. గత రెండు రోజులుగా స్టేట్ ఆడిట్ బృందం అధికారులు సత్యనారాయణ, చక్రధర్, గంగాశంకర్‌లు పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలో పలువురిని విచారించారు. తొలి రోజు పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్, పలు విభాగాల అధికారులతో పలు అంశాలపై చర్చించడంతోపాటు డిపార్టుమెంట్ ఖాతాలకు సంబంధించిన లావాదేవీల వివరాలు సేకరించారు. శుక్రవారం రెండో రోజు పలు ఖాతాల నుంచి ఇతరుల ఖాతాలకు ఎంత డబ్బులు జమ అయ్యాయి..? అందుకు సంబంధించిన ఉన్నతాధికారుల అనుమతులు ఉన్నాయా..? ఏ ప్రాతిపదికగా ఇతరుల ఖాతాల్లోకి సొమ్మును బదలాయించారు..? నగదు రూపంలో ఎంత డబ్బులు డ్రా చేశారు..? చెక్కు రూపంలో ఏమైనా డబ్బులు డ్రా చేసి, ఇతరుల ఖాతాలకు జమ చేశారా..? తదితర అంశాలపై ఆరా తీశారు.



తొలిరోజు పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్‌తో సమావేశమైన ఆడిట్ బృందం అధికారులు

పలు వోచర్లు, బిల్లుల సమాచారం మాయం

రూ.కోటికిపైగా నిధులు స్వాహా వ్యవహారంపై ఆడిట్ అధికారుల విచారణలో కీలక అంశాలు బయటపడినట్లు సమాచారం. గతంలో ఇక్కడ పని చేసిన ఓ జేడీతోపాటు పలు విభాగాలకు చెందిన సిబ్బంది పాత్ర ఉన్నట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు సమాచారం. గతంలో ఇక్కడ జేడీగా పనిచేసిన ఉన్నతాధికారి ఓ విభాగం సీనియర్ అసిస్టెంట్‌కు తెలియకుండానే డిపార్టుమెంట్ ఖాతా నుంచి లక్షలాది రూపాయలు తమ కుటుంబ సభ్యుల ఖాతాలకు బదలాయించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిధుల స్వాహా విషయం బయటకు పొక్కుతుందన్న అనుమానంతోనే పలు రకాల వోచర్లు, బిల్లులకు సంబంధించిన సమాచారాన్ని కనిపించకుండా మాయం చేశారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం సెలవులో ఉన్న మరో సీనియర్ అసిస్టెంట్‌కు సంబంధిత అధికారి ఫోన్ చేసి ఆ వివరాలు అడగ్గా.. తనకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆస్పత్రిలో చేరానని, ప్రస్తుతం ఆ సమాచారం ఇవ్వలేనని బదులిచ్చినట్లు తెలిసింది. దీంతో ఆడిట్ అధికారులు రెండు రోజుల్లో తమకు లభించిన సమాచారంతో విచారణను ముగించినట్లు సమాచారం. తాము సేకరించిన ప్రాథమిక సమాచారాన్ని పశుసంవర్ధక శాఖ రాష్ట్ర డైరెక్టర్‌కు సమర్పించనున్నారు.

మరో పక్షం రోజుల తర్వాత మళ్లీ విచారణకు ..

పశుసంవర్ధక శాఖలో ప్రతి రెండేళ్లకు ఒక సారి ఆడిట్ నిర్వహించాల్సి ఉంది. అయితే దాదాపు మూడేళ్లు కావస్తున్నా ఆడిట్ జరగలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాల మేరకు సొమ్ము స్వాహాపై మరో పక్షం రోజుల్లో మరోసారి ఆడిట్ బృందం సమగ్ర విచారణకు రానున్నట్లు సమాచారం. పనిలో పనిగా ఆడిట్‌ను పూర్తి చేసుకొని వెళ్లాలన్న యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.



కచేరి నిర్వహిస్తున్న రూప

సితార వాయిద్యం.. భక్త సమ్మోహనం..

చిత్రావతి నదిలో ఏర్పాటు చేసిన లేజర్ షో




సత్యసాయి శత జయంత్యుత్సవాల రెండోరోజు అలరించిన రూప బృందం

పుట్టపర్తికి పెరిగిన భక్తుల తాకిడి

నేటి కార్యక్రమాలు

సత్యసాయి బాబా శతజయంతి వేడుకల మూడోరోజు శనివారం ప్రశాంతి నిలయంలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయికుల్వంత్ హాల్‌లో విద్యార్థులు వేదపఠనం చేస్తారు. భక్తిగీతాలను ఆలపించనున్నారు. వేడుకల్లో పాల్గొనే భక్తులకు నారాయణసేవ చేస్తారు.

పుట్టపర్తి/టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శత జయంత్యుత్సవాలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. పుట్టపర్తికి భక్తుల తాకిడి విపరీతంగా పెరిగింది. చిత్రావతి నదిలో లేజర్ షో ఏర్పాటుచేశారు. ప్రభుత్వ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉత్సవాల రెండోరోజు శుక్రవారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ హాల్‌లో సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. విద్యార్థుల వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. సత్యసాయి విద్యార్థులు మధుర గానంతో భక్తులను అలరింపజేశారు. సాయంత్రం ప్రముఖ సితార విద్వాంసురాలు రూప బృందం భక్తులను అలరింపజేసింది. వేలాదిమంది భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. నారాయణ సేవ పేరిట 80వేల మందికి అన్నదానం చేశారు.



ప్రత్యేక ఏర్పాట్లు

● పుట్టపర్తికి వచ్చే భక్తుల కోసం రైల్వేస్టేషన్ నుంచి ప్రశాంతి నిలయం వరకు ఉచిత బస్సులు ఏర్పాటు చేశారు.
● సమీప ప్రాంతాల నుంచి దాదాపు 300 అదనపు బస్సు సర్వీసులు నడపనున్నారు. యాత్రికుల రద్దీని బట్టి వాటి సంఖ్యను పెంచనున్నారు.
● 165 ప్రత్యేక రైళ్లను నడపనున్నారు.
● ప్రశాంతి నిలయం పరిసర ప్రాంతాల్లో యాత్రికుల కోసం విస్తృతంగా మౌలిక సదుపాయాలు కల్పించారు.
● భోజన కౌంటర్లు, వైద్య శిబిరాలు, తాగునీటి ఏర్పాట్లు, రాత్రివేళ అవసరమైన లైటింగ్ సదుపాయాలు, వృద్ధులు, దివ్యాంగులకు మినీ బస్సుల ద్వారా ప్రత్యేక రవాణా సౌకర్యాలు
● మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 300 మంది శానిటేషన్ కార్మికులు, సూపర్‌వైజర్లను

(మిగతా 6వ పేజీలో..)

లేజర్ షో అదుర్స్

చిత్రావతి నదిలో ఏర్పాటు చేసిన లేజర్ షో ఆకట్టుకుంటోంది. శత జయంత్యుత్సవాలను సూచించేలా షో నిర్వహిస్తున్నారు. ఇది పట్టణానికి ప్రత్యేకాకర్షణగా నిలిచింది. తిలకించేందుకు పెద్దఎత్తున భక్తులు తరలివస్తున్నారు.

సేవే పరమార్థం..

● తిరుమల వలంటీర్ వ్యవస్థకు స్ఫూర్తి

● ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులకు అండగా..

120 దేశాల్లో సత్యసాయి సేవాదళ్ కార్యక్రమాలు

పుట్టపర్తి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): 'ప్రార్థన చేసే పెదవుల కన్నా.. సేవ చేసే చేతులే మిన్న' అన్న సత్యసాయి బాబా బోధనలే మార్గదర్శకాలయ్యాయి. సేవే పరమార్థంగా పురుడు పోసుకున్న శ్రీసత్యసాయి సేవాదళ్ ప్రపంచ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేపడుతోంది. నిత్యం అనాథలు, అభాగ్యులకు అండగా నిలుస్తోంది. సత్యసాయి బాబా సేవే లక్ష్యంగా 1962లో శ్రీ సత్యసాయి సేవాదళ్‌ను స్థాపించారు. నాటి నుంచి 63 ఏళ్లుగా సత్యసాయి భక్తులు సేవాదళ్‌గా ఏర్పడి సేవలు చేస్తున్నారు.



శిక్షణలో పాల్గొన్న సేవాదళ్ సభ్యులు

120 దేశాల్లో సేవలు

120 దేశాల్లో సత్యసాయి సేవాదళ్‌గా ఏర్పడి భక్తులు.. సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. అమెరికా, జర్మనీ, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, శ్రీలంక, చైనా, సింగపూర్, దక్షిణాఫ్రికా తదితర దేశాల్లో అక్కడి సత్యసాయి భక్తులే సేవాదళ్‌లో సభ్యులుగా చేరి సేవాకార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. ప్రకృతి విపత్తులు సంభవించినపుడు తామున్నామంటూ బాధితులకు అండగా నిలుస్తున్నారు. శ్రీలంక, జపాన్ దేశాల్లో సునామీ వచ్చినపుడు సేవాదళ్.. బాధితులకు అండగా నిలిచింది. 2000లో గుజరాత్ భూకంపం, అసోం, విజయవాడ వరదల సమయంలో బాధితులకు సేవాదళ్ అందించిన సేవలు ఎనలేనివి.



సేవాదళ్ సభ్యులకు సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న ఏపీ సేవాదళ్ అధ్యక్షుడు లక్ష్మణరావు

సేవకు ప్రతిరూపం

ఆపదలో ఉన్నవారికి సేవలు అందించడంలో సత్యసాయి సేవాదళ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఉచిత విద్య, వైద్యం, తాగునీరు, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం, రహదారుల నిర్మాణ పనులు చేస్తుంటారు. యువతకు ఉపాధి అవకాశాలు చూపేందుకు సాంకేతిక శిక్షణ ఇస్తుటారు. పేదలకు స్వయం ఉపాధి కోసం పనిముట్లను సైతం పంపిణీ చేస్తారు. అన్నదాన కార్యక్రమాలు చేపడతారు. భజనలు, నగర సంకీర్తనలు, నామస్మరణ, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, మానవతా విలువలు తెలియజేయడం, భారతీయ సంస్కృతిపై యువతకు శిక్షణ ఇస్తుంటారు.

ప్రపంచంలోనే అతిపెద్ద సేవాసంస్థ

ప్రపంచంలో ఏ సంస్థకు లేనంతమంది సభ్యులు సత్యసాయి సేవాదళ్‌కు ఉన్నారనడంలో అతిశయోక్తి లేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సేవాసంస్థల సభ్యుల సంఖ్య కోటికిపైగానే ఉంటుందని తెలుస్తోంది. ప్రతి ప్రాంతం, జిల్లా, రాష్ట్రం, దేశం సేవాసంస్థల కన్వీనర్ల ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు కొనసాగుతుంటాయి.

తిరుమలలో వలంటీర్ వ్యవస్థకు స్ఫూర్తి

శ్రీసత్యసాయి సేవాదళ్ తరహా వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీకారం చుట్టింది. గతంలో దేవస్థానం సభ్యులకు సత్యసాయి సేవాసంస్థల సభ్యులు శిక్షణ ఇచ్చారు. సేవాదళ్‌ను స్ఫూర్తిగా తీసుకుని తిరుమలలో వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు.


వేల సంఖ్యలో రానున్న సభ్యులు

సత్యసాయి బాబా శతజయంతి వేడుకల్లో భక్తులకు అవసరమైన అందించడానికి రాష్ట్రం, దేశం, ప్రపంచం నలుమూలల నుంచి వేలాదిమంది సత్యసాయి సేవాదళ్ సభ్యులు ప్రశాంతి నిలయం చేరుకుంటారు. 12రోజులపాటు ప్రశాంతి నిలయంలో నారాయణ సేవ, ఉచిత వైద్య శిబిరాలు, వృద్ధుల తరలింపు, పారిశుధ్య పనులు చేపడతారు.

అందరూ సమానమే..

సామాన్యుల నుంచి అత్యున్నత హోదా కలిగిన అధికారులు, కార్పొరేట్ సంస్థల అధినేతలు సైతం సేవాదళ్‌లో సభ్యులుగా ఉన్నారు. వీరిలో ఏ మాత్రం హోదా, డబ్బు, పదవి ఉందన్న గర్వం కనిపించదు. సత్యసాయి బోధనలే పరమావధిగా భావించి అవసరమైన వారికి అన్ని సేవలు అందిస్తారు. నిత్యం ప్రశాంతి నిలయం, దర్శనం హాలు, విద్యాసంస్థలు, ఆస్పత్రుల్లో సేవలందిస్తున్నారు. ప్రశాంతి నిలయంలో ప్రతి 15 రోజులకు కుమార సేవాసభ్యులు మారుతూ ఉంటారు. ఒక ప్రాంతం సభ్యులు 15 రోజులు సేవ చేసిన అనంతరం వారి ప్రాంతాలకు తిరిగి వెళ్తారు. తరువాత మరో ప్రాంతం నుంచి వచ్చిన సభ్యులు సేవల్లో చేరిపోతారు. ఈ ప్రక్రియ నిత్యం కొనసాగుతూ ఉంటుంది.





సత్యసాయిబాబాతో 1968లో కొత్తచెరువు జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులు (వలంటీర్లు)

రాయలసీమలో మొట్టమొదటి ఐ క్యాంప్

సత్యసాయిబాబా.. ప్రజలకు అందిస్తున్న సేవా కార్యక్రమాలలో భాగంగా 1968లోనే ప్రపంచ ప్రఖ్యాత చేతి కంటి ఆపరేషన్ నిపుణుడు డాక్టర్ మురుగప్పమోడీ ఆధ్వర్యంలో రాయలసీమలోనే మొట్టమొదటి ఐ క్యాంపు నిర్వహించారు. ఈ ఐ క్యాంపునకు వచ్చిన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొత్తచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలకు పదో తరగతి విద్యార్థులు 30 మంది వలంటీర్లుగా సేవలందించారు. వాటిని గమనించిన సత్యసాయిబాబాజ విద్యార్థులు, డాక్టర్ మురుప్పమోడీతో కలిసి ఫొటోను తీయించుకున్నారు.

- ఆంధ్రజ్యోతి, ధర్మవరం/కొత్తచెరువు

బాబాకు నేతాజీ అభినందన

ధర్మవరం/కొత్తచెరువు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన నేతాజీ సుభాష్‌చంద్రబోస్ 1942లో బుక్కపట్నం గ్రామానికి వచ్చినట్లు చెబుతూ సత్యసాయిబాబా 2007లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రసంగించిన ఆడియో ప్రస్తుతం సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. బుక్కపట్నం ప్రాంతానికి చెందిన ఎంకే దాసప్ప, గణేనాయక్‌లు పేద ప్రజల కోసం కమ్యూనిస్టులుగా మారి భూస్వాములు, బ్రిటీష్ వారిని ఎదిరించి పోరాటాలు చేశారు. వారి పోరాటం గురించి తెలుసుకుని, వారిని కలవడానికి 1942లో సుభాష్‌చంద్రబోస్ బుక్కపట్నం విచ్చేశారు. ఆ సమయంలో సత్యసాయిబాబా ఆధ్యాత్మిక ప్రసంగాలు విన్న నేతాజీ, సత్యసాయిబాబాను కలవడానికి వస్తున్నానని అంతరంగికుల ద్వారా కబురు పంపారు. ఇక్కడ నేతాజీ ఉండటానికి సరైన వసతి లేదని, తానే బుక్కపట్నం వస్తానని బాబా తిరిగి కబురు పంపారు. దీంతో సుభాష్ చంద్రబోస్ తన కారును పుట్టపర్తికి పంపి బాబాను బుక్కపట్నం రప్పించారు. సత్యసాయిబాబాను చూసిన నేతాజీ ఆలింగనం చేసుకుని 'చిన్నవయస్సులోనే ఆధ్యాత్మిక సందేశాలతో ప్రజలను చైతన్య పరుస్తున్నారు. మీ సేవలు, ప్రసంగాలు దేశప్రజలకు ఎంతో ఉపయోగమని' అభినందించినట్లు ఆ ప్రసంగంలో తెలియజేశారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన గొప్ప వీరుడు సుభాష్ చంద్రబోస్ అని, ఆయన పోరాటంతోనే స్వాతంత్ర్యం సిద్ధించిందని సత్యసాయిబాబా ఆ సమయంలో తెలిపారు.



పుట్టపర్తిలో కార్డెన్ సెర్చ్



పుట్టపర్తిలో ప్రజలకు సూచనలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పుట్టపర్తిరూరల్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను పురస్కరించుకుని ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు యంత్రాంగం భారీస్థాయిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించింది. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని కర్ణాటకనాగేపల్లి, పెద్దబజార్, సాయినగర్, చిత్రావతి రోడ్డు గుట్ట, ప్రశాంతిగ్రాంలోని ప్రతిఇంటినీ తనిఖీ చేశారు. ఎస్పీ ఆధ్వర్యంలో ఐదుగురు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 25 మంది ఎస్ఐలు, 250 మంది స్పెషల్‌పార్టీ పోలీసులతో సోదాలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చిన వ్యక్తుల వివరాలను సేకరించారు. రౌడీషీటర్లు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి ఇళ్లను పరిశీలించారు. తనిఖీల్లో డ్రోన్, బాడీవోర్న్ కెమెరాలు, మొబైల్ స్కానింగ్ డివైజ్‌లు, ఫింగర్‌ప్రింట్ స్కానర్లను ఉపయోగించారు.

50 వాహనాలు సీజ్

కార్డెన్ సెర్చ్‌లో నంబరు ప్లేట్లు, సరైన రికార్డులులేని 50వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. రికార్డులు చూపి వాహనాలను తీసుకెళ్లాలన్నారు. లేదంటే 102 సీఆర్‌సీసీ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రాత్రివేళల్లో అల్లర్లు, గొడవలుచేస్తే రౌడీషీట్లు తెరుస్తామన్నారు. బాబా శతజయంతి వేడుకల నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి స్థానికంగా లాడ్జీలు, హోటళ్లలో బసచేస్తున్నవారిపై ప్రత్యేకనిఘా ఉంచామన్నారు. లాడ్జి యజమానులు.. ప్రతిఒక్కరి వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. కార్డెన్ సెర్చ్‌లో డీఎస్పీలు విజయ్‌కుమార్, నరసింగప్ప, శివనారాయణస్వామి, హేమంత్‌కుమార్, మహేశ్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్పీ సీఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది, స్పెషల్‌పార్టీ బృందాలు పాల్గొన్నాయి.



ఇంటింటా తనిఖీలు నిర్వహిస్తున్న డీఎస్పీ విజయ్‌కుమార్, స్పెషల్‌పార్టీ పోలీసులు

సితార వాయిద్యం.. భక్త సమ్మోహనం..

(5వ పేజీ తరువాయి)

నియమించారు.

వీఐపీల రాకకు ప్రత్యేక ఏర్పాట్లు

- ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు ప్రధానమంత్రి, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, గవర్నర్లు, రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేలు పుట్టపర్తికి రానుండడంతో అందుకనుగుణంగా ప్రత్యేక మార్గాలు, రవాణా సౌకర్యాలు సిద్ధం చేశారు.
- భద్రత కోసం 5000 మంది పోలీసులను నియమించారు.
- పుట్టపర్తి చుట్టుపక్కల 250 నిఘా కెమెరాలు ఏర్పాటు చేశారు.

17 నుంచి శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

సత్యసాయిబాబా శతజయంతి వేడుకల సందర్భంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 23వ తేదీ వరకు పుట్టపర్తిలోని శిల్పారామంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ ప్రకటనలో తెలిపారు. రోజూ సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ప్రముఖ కళాసంస్థల ఆధ్వర్యంలో ప్రదర్శనలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ఈనెల 15 నుంచి 25వ తేదీ వరకు డ్వాక్రాబజార్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు కేంద్రమంత్రి పీయూష్ గోయల్ రాక

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ శనివారం పుట్టపర్తి రానున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు విశాఖపట్నం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 3 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. అనంతరం ప్రశాంతి నిలయానికి చేరుకుని, సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొంటారు. ఆ తర్వాత ముంబైకి బయలుదేరి వెళ్తారు.



పరిష్కార వేదిక రద్దు


సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో ఈనెల 17న నిర్వహించాల్సిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.


భక్తుల కోసం టోల్ ఫ్రీ నంబరు

పుట్టపర్తికి వచ్చే యాత్రికులు సమాచారం, సహాయం కోసం 18002335598 టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు చేశారు.

అడ్వాన్స్‌డ్ ఎండోస్కోపీ పరికరం ప్రారంభం

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రూ.2.45 కోట్ల విలువైన అడ్వాన్స్‌డ్ ఎండోస్కోపీ పరికరాన్ని సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రోగులకు అధునాతన వైద్యసేవలు అందించడానికి ఆధునిక పరికరాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. పేగులో ఇన్ఫెక్షన్లను సులభంగా గుర్తించి, వైద్యసేవలు అందించడానికి ఇది ఉపయోగపడుతుందని ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ గురుమూర్తి పేర్కొన్నారు.





నారాయణ సేవకు క్యూలైన్‌లో నిల్చున్న మహిళలు, ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

సర్వం సిద్ధం: కలెక్టర్

సత్యసాయి శతజయంతి ఉత్సవాల విజయవంతానికి సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. పుట్టపర్తిలో నూతనంగా ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను శుక్రవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. పుట్టపర్తికి వచ్చే భక్తులు, యాత్రికుల కోసం విస్తృత స్థాయిలో రవాణా సదుపాయాలు కల్పించామన్నారు. అనంతరం రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. అక్కడి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.



పుట్టపర్తి రైల్వేస్టేషన్‌లో భక్తులతో మాట్లాడుతున్న కలెక్టర్

రేపు సహకార ఉద్యోగుల ఎన్నికలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ సహకార ఉద్యోగుల జిల్లా కమిటీ ఎన్నికలు ఈనెల 16న సుభాష్‌రోడ్డులోని ఎన్టీఆర్ సహకారభవన్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి సీనియర్ ఇన్‌స్పెక్టర్ కోటగుడ్డం లీలా తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, వెంటనే ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుందని తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని, బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ ఉంటుందన్నారు. పోలింగ్ బూత్‌లోకి మొబైల్ ఫోన్లను అనుమతించమనీ, సభ్యులు గమనించాలని కోరారు.

ఇంకెప్పుడు..?

మొక్కజొన్న కొనుగోళ్లపై తీవ్ర నిర్లక్ష్యం.. గత నెల రెండో వారంలోనే ప్రతిపాదనలు

కోతలు పూర్తైనా... ఏర్పాటుకాని కొనుగోలు కేంద్రాలు

అనుమతులు కూడా ఇవ్వని వైనం

బయట మార్కెట్‌లో అమ్ముకుంటున్న రైతులు





బెళుగుప్ప మండలం రమనేపల్లిలో ఆరబోసిన మొక్కజొన్న పంట

అనంతపురం అర్బన్/బెళుగుప్ప, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న రైతులకు కష్టకాలం వచ్చింది. గతనెల మొదటి వారం నుంచి కోతలు పూర్తై.. పంట చేతికొస్తున్నా.. ప్రభుత్వం మద్దతు ధరతో మొక్కజొన్న కొనుగోలు చేయడంపై దృష్టి సారించకపోవడం గమనార్హం. మొక్కజొన్న క్వింటాల్ మద్దతు ధర రూ.2400గా ప్రకటించింది. అక్టోబరు రెండో వారంలోనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం జిల్లా అధికారులు.. ఏపీ మార్క్‌ఫెడ్ ఎండీకి లేఖ పంపారు. అక్కడి నుంచి ప్రభుత్వానికి ఫైల్ పంపినట్లు సమాచారం. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు లేఖ పంపి నెల రోజులు దాటినా నేటికీ అనుమతులు మంజూరు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

కోతలు ప్రారంభమయ్యాక తగ్గిన ధర

ఈ ఏడాది ఖరీఫ్‌లో బోరుబావుల కింద జిల్లాలో మొక్కజొన్న సాగుచేశారు. జిల్లావ్యాప్తంగా 42వేల హెక్టార్లలో పంట పెట్టారు. ఈసారి 1.50 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా దిగుబడి వచ్చినట్లు అంచనా. అక్టోబరు ప్రారంభం నుంచి పంట కోతలు మొదలు పెట్టారు. అక్టోబరు రెండోవారానికే 95 శాతం కోతలు పూర్తయ్యాయి. తుఫాన్, వరుస వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో కోతలు వాయిదా వేసుకున్నారు. అలాంటి రైతులు ఈనెల మొదటి వారంలో పంట కోత కోశారు. పంట కోతల ప్రారంభంలో మొక్కజొన్న క్వింటా ధర రూ.2300 పలికింది. కోతలు పెరిగే కొద్దీ ధర తగ్గుతూ వచ్చింది. కొందరు దళారులు కుమ్మక్కై ధరను తగ్గించి, రైతులను దోపిడీ చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం క్వింటా ధర రూ.1700కి పడిపోయింది.

ప్రభుత్వం స్పందించేనా..!

గతేడాది ఎకరాకు 30 నుంచి 35 క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చింది. ఈసారి కొన్ని ప్రాంతాల్లో 15 నుంచి 20 క్వింటాళ్లు, మరికొన్నిచోట్ల 20 నుంచి 25 క్వింటాళ్లదాకా దిగుబడి వచ్చింది. గతేడాదితో పోలిస్తే ఈసారి మొక్కజొన్న పంట దిగుబడి తగ్గింది. అవసరంలేని సమయంలో వరుసగా వర్షాలు కురవడం.. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలోనే దిగుబడి తగినట్లు రైతులు వాపోతున్నారు. దిగుబడి తగ్గడానికితోడు ధరలు పడిపోవడంతో రైతులు మరింత నష్టపోయే ప్రమాదం ఉంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో కొందరు రైతులు తప్పని పరిస్థితుల్లో బయట మార్కెట్‌లో తక్కువ ధరకే పంట ఉత్పత్తులను అమ్ముకుంటున్నారు. మరి కొందరు ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయకపోతుందా..? అని ఆశతో ఎదురుచూస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు తక్షణమే అనుమతులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.

ధరలేక నష్టపోతున్నాం..



రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. పంట కోత సమయంలో ధర బాగానే ఉండింది. రోజుల వ్యవధిలో ధర భారీగా తగ్గించారు. బయట వ్యాపారులు క్వింటా రూ.1700కి అడుగుతున్నారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.2400 ప్రకటించడంతో ఎంతో ఆశలు పెట్టుకున్నాం. అడవుల్లో ఆరబెట్టుకుని ఉంటున్నాం. మద్దతు ధరతో ప్రభుత్వమే పంటను కొనుగోలు చేసి ఆదుకోవాలి.

- రైతు ఈరన్న, రమనేపల్లి, బెళుగుప్ప మండలం

తక్షణమే కొనుగోలు చేయాలి



మొక్కజొన్న పంట ఉత్పత్తులను ప్రభుత్వం తక్షణమే మద్దతు ధరతో కొనుగోలు చేయాలి. గతనెల మొదటి వారం నుంచే పంట కోతలు పూర్తై.. చేతికొస్తోంది. ఇప్పటికే పంట కోతలు వందశాతం పూర్తయ్యాయి. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని జిల్లా అధికారులు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అనుమతులు రాలేదు. జిల్లాలో పరిస్థితిని అర్థం చేసుకుని, తక్షణమే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి, రైతులకు మద్దత ధర కల్పించాలి. లేకపోతే ఈసారి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

- మధుసూదన్, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

ప్రతిపాదనలు పంపించాం..

జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు ఇప్పటికే ఏపీ మార్క్‌ఫెడ్ ఎండీకి ప్రతిపాదనలు పంపించాం. అక్కడి నుంచి ప్రభుత్వానికి కూడా నివేదికలు వెళ్లాయి. త్వరలోనే అనుమతులు వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే.. రైతు సేవాకేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించి, మొక్కజొన్న పంట కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటాం.

- పెన్నేశ్వరి, ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం

జేఎన్‌టీయూలో ఘనంగా నెహ్రూ జయంతి



నెహ్రూ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

అనంతపురంరూరల్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పరిపాలన భవనం, ఇంజనీరింగ్ కళాశాలలో దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పరిపాలన భవనంలో వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య తదితరులు.. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఇంజనీరింగ్ కళాశాలలోని నెహ్రూ విగ్రహానికి నివాళులు అర్పించారు. వీసీ మాట్లాడుతూ.. నెహ్రూ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. ఆయనలోని విశిష్ట వ్యక్తిత్వం, సమయపాలన, ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, ఆచార్యులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.17వేలు

అనంతపురం రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి ధర రూ.14వేలు పలికాయన్నారు.

క్రైం కార్నర్

భర్తను రెచ్చగొట్టినందుకే హత్య


మాట్లాడుతున్న సీఐ మహానంది, ఎస్ఐలు శివ, మహేష్

బెళుగుప్ప, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ కాలనీలో మహిళ శాంతి హత్యకు సంబంధించి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మహానంది శుక్రవారం తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐలు, ట్రైనీ ఎస్ఐ మహేష్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మృతురాలి బంధువు హరి ఫిర్యాదు మేరకు... అదేకాలనీలో ఉన్న పాల తిప్పేస్వామి శాంతి వెంటపడి వేధిస్తుండేవాడు. పలుమార్లు హెచ్చరించినా మార్పు రాలేదు. గురువారం ఇంట్లోకి చొరబడి అత్యాచారానికి యత్నించాడు. శాంతి కేకలు వేయడంతో తామంతా వెళ్లగా తిప్పేస్వామి పరిగెత్తాడు. ఇది చూసిన తిప్పేస్వామి కొడుకు జయసింహ వివాహేతర సంబంధం అంటగడుతూ శాంతి భర్త ఆంజనేయులుకు ఫోన్‌చేసి రెచ్చగొట్టాడు. దీంతో క్షణికావేశంతో భార్యను అనుమానించి కొడవలితో దారుణంగా హత్యచేశాడు. పాల తిప్పేస్వామి, జయసింహ, ఆంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పొలాల్లో గుర్తుతెలియని మృతదేహం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గార్లదిన్నె, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువపల్లి సమీపాన 44వ జాతీయ రహదారి పక్కనే పొలాల్లో శుక్రవారం గుర్తుతెలియని శవం పడి ఉన్నట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషా తెలిపారు. గ్రామస్థులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయసు 40 ఏళ్లు ఉంటుందన్నారు. అతడు నీలం టీషర్టు, తెల్లటి జీన్స్ ప్యాంటు ధరించినట్లు తెలిపారు. అతడి ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అనంత ఆర్ట్స్ కాలేజీ హవా

● ఎస్కేయూ అంతర్ కళాశాలల టోర్నీ


బ్యాడ్మింటన్ విజేత అనంతపురం ఆర్ట్స్ కళాశాల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కళ్యాణదుర్గం/అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల గ్రూప్ బి క్రీడా పోటీల్లో అనంతపురం ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులు సత్తాచాటారు. శుక్రవారం ముగిసిన ఈ పోటీల్లో బ్యాడ్మింటన్, కబడ్డీ విభాగాల్లో విజేతగా, బాస్కెట్ బాల్ రన్నరప్‌గా ఆర్ట్స్ కాలేజీ జట్లు నిలిచాయి. అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ జట్లు బాస్కెట్ బాల్ విజేతగా, బ్యాడ్మింటన్ రన్నరప్‌గా నిలిచాయి. విజేతలకు ఎస్‌వీజీఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హర్షలత, పీడీ, నిర్వాహక కార్యదర్శి జయరామప్ప శుక్రవారం ట్రోఫీలు అందజేశారు.

జాతీయ పోటీలకు కేజీబీవీ విద్యార్థులు


పతకాలు సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న ఎస్‌వో ఉమాదేవి

కూడేరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో జరిగే కురాష్ పోటీలకు కూడేరు కేజీబీవీ విద్యార్థినులు ఎంపికయ్యారు. 69వ స్కూల్ గేమ్స్‌లో భాగంగా అండర్ 14, 17, 19 విభాగంలో అంతర్ రాష్ట్ర కురాష్ పోటీలు అనంతపురం సమీపంలోని మాంటిస్సోరి స్కూల్‌లో నిర్వహించారు. ఈ నెల 8, 9 తేదీల్లో జరిగిన పోటీల్లో కేజీబీవీ విద్యార్థినులు 12 మంది పాల్గొన్నారు. ఇందులో అక్షిత, కీర్తిన, మనీష, లావణ్య, వరలక్ష్మి, లోకేశ్వరి, పూజిత, గోపిక పోటీల్లో సత్తా చాటి బంగార పతకాలు సాధించగా, మరో నలుగురు కాస్యం సాధించారు. దీంతో బంగారు పతకాలు సాధించిన 8మంది జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ఎస్‌వో ఉమాదేవి తెలిపారు. డిసెంబరు 16 నుంచి 21 వరకు ఉత్తరప్రదేశ్‌లోని సహరన్‌పూర్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. అంతర్ రాష్ట్ర కబడ్డీ పోటీలకు భానుశ్రీ, అక్షిత, ప్రియా, నవ్యశ్రీ ఎంపికైనట్లు తెలిపారు.

ఆంధ్రా జట్టు ప్రాబబుల్స్‌కు నలుగురు..


సాత్విక్


ఆదినారాయణరెడ్డి


సంజయ్‌కుమార్


దేవాన్ష్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అండర్-16 మల్టీడే క్రికెట్ జట్టు ప్రాబబుల్స్‌లో జిల్లాకు చెందిన నలుగురికి చోటు దక్కింది. సాత్విక్, ఆదినారాయణరెడ్డి, సంజయ్‌కుమార్, దేవాన్ష్ ఎంపికయ్యారు. వీరు ఈనెల 15వతేదీ నుంచి మంగళగిరిలో నిర్వహించే రాష్ట్ర జట్టు సెలెక్షన్ మ్యాచ్‌లు ఆడతారన్నారు. వారికి పలువురు అభినందనలు తెలిపారు.

సెన్సర్ గుబులు !

● డ్రైవింగ్ టెస్టుకు జిల్లా కేంద్రంలో తగ్గిన దరఖాస్తులు
● యూనిట్ కార్యాలయాలకు పెరుగుతున్న వైనం

అనంతపురం టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ లైసెన్స్ కావాలనుకునేవారికి సెన్సర్ గుబులు పట్టుకుంది. జిల్లా కేంద్రంలోని రవాణాశాఖ కార్యాలయంలో ప్రధానంగా ఈ సమస్య కనిపిస్తోంది. గతంలో మ్యానువల్ పద్ధతిలో బ్రేక్ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో డ్రైవింగ్ టెస్ట్ చేసేవారు. 2022 డిసెంబరు 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లోని రవాణాశాఖ కార్యాలయాల్లో ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌ను సెన్సర్ విధానంలో అమలులోకి తీసుకువచ్చారు. ఇందులో కెమెరాలు, సెన్సర్లు ప్రధాన భూమిక పోషిస్తాయి. ఈ విధానంలో వాహన చోదకుడు బైక్ లేదా కారు నడిపే సమయంలో ఏ చిన్న తప్పిదం చేసినా దానిని కెమెరాలు పసిగట్టి డ్రైవింగ్ టెస్ట్‌లో ఫెయిల్ అయినట్లు నిర్ధారిస్తాయి. మ్యానువల్ విధానంలో చిన్న చిన్న తప్పిదాలకు బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు వెసులుబాటు ఇచ్చేవారు. సెన్సర్ విధానం అమలులోకి వచ్చాక ఇందుకు ఆస్కారం లేకుండా పోయింది. దీంతో ద్విచక్ర వాహనం డ్రైవింగ్ టెస్టు పాస్ అయ్యే వారి శాతం 48 నుంచి 50 శాతం ఉండగా, కారు డ్రైవింగ్ టెస్టులో 80 శాతం ఉంది. దీంతో సెన్సర్ విధానం అమలులో ఉన్న అనంతపురం


డ్రైవింగ్ టెస్ట్ మార్గంలో ఏర్పాటు చేసిన సెన్సర్ కెమెరాలు


ద్విచక్రవాహనదారుడికి సెన్సర్ విధానంలో డ్రైవింగ్ టెస్ట్

నగరంలో కాకుండా యూనిట్ కార్యాలైన కళ్యాణదుర్గం, గుంతకల్లు, రాయదుర్గం, తాడిపత్రి ప్రాంతాల్లో మ్యానువల్ డ్రైవింగ్ టెస్టు కోసం వెళ్తున్నారు. ఇందుకోసం ఆయా ప్రాంతాల్లో నివాసముంటున్నట్లు చిరునామాలు మార్పించుకుంటున్నారు. దీంతో జిల్లా కేంద్రంలో డ్రైవింగ్ టెస్టు దరఖాస్తులు 30శాతం మేర తగ్గిపోగా యూనిట్ కార్యాలయాల్లో పెరిగాయి.

అపోహలు వీడాలి: వీర్రాజు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్



సెన్సర్ విధానంలో డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్‌పై ప్రజల్లో ఉన్న అపోహలు వీడాలి. సెన్సార్ విధానం ద్వారా వాహనదారులకు ఎలాంటి తప్పిదాలకు ఆస్కారముండదన్నది గమనించాలి. వాహనం నడపడం బాగా వచ్చి, రోడ్డు నియమాలు తెలిస్తే లైసెన్సు పొందడం సులభమే. టెస్టుకు వచ్చే ప్రతి ఒక్కరికీ ముందుగా సెన్సర్ విధానంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించి, ఆ తర్వాతనే టెస్టుకు పంపుతున్నాం.

కలగానే.. కాలేజీ..

కూడేరులో జూనియర్ కళాశాల లేక విద్యార్థుల అవస్థలు

● నిత్యం జిల్లా కేంద్రానికి పరుగులు
● బస్సులు దొరక్క తిప్పలు
● ఆర్థిక భారంతో చదువు మానేస్తున్న పలువురు


కూడేరు ఉన్నత పాఠశాల

కూడేరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలానికి జూనియర్ కళాశాల కలగానే మిగిలిపోతోంది. దీంతో మండలం నుంచి వందలాది మంది విద్యార్థులు రోజూ జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఉదయాన్నే తినీతినక పల్లెల్లో బయల్దేరి కూడేరుకు చేరుకోవాల్సి వస్తోంది. అక్కడ బస్సుల కోసం వేచిచూడాల్సిందే. బస్సు ఫుల్లుగా ఉన్నా.. ఇరుక్కుని రావాల్సిందే. రోజూ ఇవే తిప్పలు. కళాశాలకు సమయానికి వెళ్లడం గగనమే. ఇలా.. సరిగా తినక, ఇబ్బందులు పడుతూ కాలేజీకి వెళ్లిరావాల్సి వస్తోంది. రోజూ ఆటో, బస్సు చార్జీలు భరించాల్సి. ఆర్థిక భారం భరించలేక పలువురు విద్యార్థులు చదువు మధ్యలోనే మానేస్తున్నారు. బంగారు భవిష్యత్తు కోల్పోతున్నారు.

అప్పట్లో ఏర్పాటైనా..

మండలంలో కూడేరు, మరుట్ల, కమ్మూరు, జల్లిపల్లి, కొర్రకోడు, కరుట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో పదో తరగతి వరకు విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు. ఆ తర్వాత ఇంటర్మీడియట్ చదివేందుకు అనంతపురం వెళ్లాల్సి వస్తోంది. మండలానికి 1995లోనే జూనియర్ కాలేజీ మంజూరైంది. ఆదరణ లేక మూసేశారు. మళ్లీ విద్యార్థులు అనంతపురానికి పరుగులు తీయక తప్పట్లేదు. చదువుకునే విద్యార్థుల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతుండటంతో మండల కేంద్రంలోనే జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది.


బస్సులో జిల్లా కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు

వైసీపీ హయాంలో ఆర్భాటం

గత వైసీపీ పాలనలో హైస్కూల్ ప్లస్ పేరుతో కూడేరు ఉన్నత పాఠశాలలోనే జూనియర్ కాలేజీ నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. ఆర్భాటం చేశారు. లెక్చరర్లను నియమించింది లేదు, గదులు తదితర సౌకర్యాలు కల్పించిందీలేదు. దీంతో హైస్కూల్ ప్లస్ అట్టర్ ఫ్లాప్ అయింది. విద్యార్థులు పట్టణ ప్రాంతాలకు పరుగులు తీయక తప్పలేదు. గత పాలకులు ఆర్భాటంగా కాలేజీ గురించి ప్రచారం చేసుకున్నా.. నిర్వహణలో పూర్తిగా విఫలమయ్యారు.

జిల్లా కేంద్రానికి వెళ్లడం కష్టంగా ఉంది



కూడేరు నుంచి అనంతపురం వెళ్లాలంటే కష్టంగా ఉంది. కాలేజీకి వెళ్లడానికి బస్సు పాసు నెలనెలా కట్టాల్సి ఉండటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. మండల కేంద్రంలోనే కాలేజీ ఉంటే ఇంటి వద్దనే భోజనం తినేసి వెళ్లవచ్చు. జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఉదయమే పరుగులు తీయాల్సి వస్తోంది. ఆర్థిక ఇబ్బందులతో బస్సు పాసుకు కట్టడానికి అవస్థలు పడుతున్నాం.

- సంతోష్, ఇంటర్ విద్యార్థి, కూడేరు

తినీతినక పరుగులు



కూడేరు నుంచి అనంతపురంలోని కాలేజీల్లో చదువుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సకాలంలో బస్సు దొరక్కపోతే కాలేజీకి ఆలస్యమవుతోంది. దీంతో చదువు కోవడం కష్టంగా మారింది. ఉదయమే తినీతినక బస్సు కోసం పరుగులు తీస్తున్నాం. మండల కేంద్రంలో కాలేజీ ఉంటే సమయానికి తినడంతోపాటు క్లాసులకు హాజరు అవుతాం. ప్రభుత్వం స్పందించి మండల కేంద్రంలో ఇంటర్ కాలేజీ ఏర్పాటు చేయాలి.

-సన్నీ, ఇంటర్ విద్యార్థిని, కూడేరు

ఆధునిక పనిముట్లు అందించండి

● బీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు

అనంతపురం విద్య, నవంబరు14(ఆంధ్రజ్యోతి): ఆదరణ పథకం ద్వారా ఆధునిక పనిముట్లు అందించాలని బీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు కోరారు. జిల్లా కార్యాలయంలో శుక్రవారం బీసీకార్పొరేషన్ ఈడీ రామసుబ్బారెడ్డిని ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు కలిశారు. ఈ సందర్భంగా తొలుత ఆదరణ-3.0 పథకం అమలు, వాటిద్వారా అందించే పనిముట్లు, యంత్రాల గురించి చర్చించారు. ఈడీ స్పందిస్తూ ఈపథకం ద్వారా యంత్రాలు ఇవ్వరని, కేవలం ఆయా కులవృత్తులకు అవసరమైన పనిముట్లు మాత్రమే అందిస్తారని తెలిపారు. లబ్ధిదారుడు 10శాతం సొమ్ము చెల్లిస్తే మిగిలిన 90శాతం నిధులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కార్పొరేషన్ డైరెక్టర్లు మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీని దృష్టిలో పెట్టుకొని వృత్తిదారులకు అధునాతన పనిముట్లు ఇవ్వాలని కోరారు. ఆమేరకు తగిన చర్యలు తీసుకుంటామని ఈడీ రామసుబ్బారెడ్డి హామీ ఇచ్చారు.


బీసీ కార్పొరేషన్ ఈడీతో బీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు

సమావేశంలో రజక కార్పొరేషన్ డైరెక్టరు పరమేష్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టరు పోతుల నరసింహులు, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టరు కొండన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టరు లక్ష్మీనరసింహమూర్తి, కుమ్మరి కార్పొరేషన్ డైరెక్టరు వెంకటసుబ్బయ్య, బెస్త కార్పొరేషన్ డైరెక్టరు పవన్ కుమార్, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టరు ఇమామ్‌హుస్సేన్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్లు శ్రీదేవి, శ్రీనివాసులు, కురుబ కార్పొరేషన్ డైరెక్టరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో ముందడుగు

● మేరీ వటమట్టం, బబ్లూ గంగూలీ
● ఘనంగా టింబక్టు కలెక్టివ్ 35వ వార్షికోత్సవాలు

చెన్నేకొత్తపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతోనే టింబక్టు కలెక్టివ్ సుదీర్ఘ ప్రయాణం సాగిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు మేరీ వటమట్టం, బబ్లూగంగూలీ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని కృష్ణమందిరం సమీపంలో టింబక్టు కలెక్టివ్ 35వ వార్షిక వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగిరి, రొద్దం, చెన్నేకొత్తపల్లి, పెనుకొండ మండలాల నుంచి పెద్ద ఎత్తున సహకార సంఘాల సభ్యులు ప్రతినిధులు, టింబక్టు సిబ్బంది హాజరయ్యారు. అక్కడ ఏర్పాటుచేసిన వివిధ రకాల స్టాల్స్‌లను మేరీ, బబ్లూ గంగూలీతోపాటు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ నుంచి వచ్చిన మల్లారెడ్డి ప్రారంభించారు. ప్రధానంగా సేంద్రియ ఎరువులు, పరికరాల ప్రదర్శన, పశువుల స్టాల్స్ సంప్రదాయ విత్తనాలు, సంప్రదాయ సంగీత వాయిద్యాలు తదితర సాంస్కృతిక స్టాల్స్ ఏర్పాటుచేశారు. అనంతరం మేరీ, బబ్లూ మాట్లాడుతూ 1990నవంబరు 14న సంస్థ ప్రారంభమై ఉమ్మడి జిల్లాలో 45 వేల కుటుంబాలతో కలిసి పని చేస్తోందన్నారు. భూమి లేని కూలీలు, పిల్లలు, యువత, దివ్యాంగులు, రైతులు, అల్పసంఖ్యాక వర్గాల అభ్యున్నతి కోసం సంస్థ కృషి చేస్తోందన్నారు. భూమి లేని కూలీల జీవనోపాధికి కల్పవల్లి వంటి సహకార సంఘాలను టింబక్టు ప్రోత్సహిస్తోందన్నారు. మల్లారెడ్డి మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న రుగ్మతలను గమనించి దీర్ఘకాలంగా ఉన్న వాటిని రూపుమాపాలని సూచించారు. అనంతరం టింబక్టు కలెక్టివ్ సహకారసంఘసభ్యులు నిర్వహించిన జానపదం నృత్యం, చెక్కభజన, కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో విస్తార్ ట్రస్టుకు చెందిన మెర్సి కొప్పెన్, ఎంసీ నుంచి ప్రదీప్, ప్రతినిధులు శాంతరావు, త్రిలోచనశాస్త్రీ, శ్రీకాంత్, ఉదయ్ కుమార్, మన్నీలమ్మ, భరత్‌నాయక్, టింబక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుకన్య కాకమూరి పాల్గొన్నారు.


స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న బబ్లూ గంగూలీ

అదిరేట్టు..!

కక్కలపల్లి మార్కెట్‌లో పెరిగిన టమోటా ధర



అనంతపురం రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు ఒక్కసారిగా పెరిగాయి. కొన్ని రోజులుగా నిలకడగా ఉన్న ధరలు అమాంతం పెరిగాయి. మండలంలోని కక్కలపల్లి టమోటా మార్కెట్ కిలో గరిష్ఠంగా రూ.35నుంచి రూ.40 మధ్య అమ్ముడుపోతున్నాయి. మార్కెట్ నుంచి ఎగుమతి అయ్యే ప్రాంతాల్లో కాయలు లేకపోవడం, జిల్లాలో కూడా ఆశించిన స్థాయిలో రాకపోవడం ధరల పెరుగుదలకు కారణమని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఉత్తరప్రదేశ్, ఢిల్లీ తదితర ప్రాంతాలకు పెద్దఎత్తున కక్కలపల్లి మార్కెట్ నుంచి టమోటాలు ఎగుమతి అవుతున్నాయి. వర్షాల కారణంగా దిగుబడులు తగ్గిపోయాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మార్కెట్‌కు కాయలు రావడం తగ్గిపోవడం ధరల పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది. మార్కెట్‌కు గతంలో నాలుగైదు లక్షల వరకు సరుకు వచ్చేదనీ.. ప్రస్తుతం రెండులక్షల వరకు వస్తున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలోనే ధరలు పెరిగాయంటున్నారు. శుక్రవారం గరిష్ఠంగా కిలో రూ.37తో అమ్ముడుపోయాయి. కనిష్ఠ ధర రూ.20 పలకగా.. సరాసరి రూ.27తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 2,250 టన్నుల కాయలు వచ్చాయన్నారు.

రూట్‌మ్యాప్ రూపొందించండి

● సిబ్బందికి డీఈఓ ప్రసాద్‌బాబు ఆదేశం


సిబ్బందికి ఆదేశాలు ఇస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య,నవంబరు14 (ఆంధ్రజ్యోతి): సైన్స్‌సెంటర్‌తో పాటు ఇతర ప్రముఖ కేంద్రాలను విద్యార్థులు సందర్శించేలా రూట్‌మ్యాప్ రూపొందించాలని సిబ్బందికి డీఈఓ ప్రసాద్‌బాబు ఆదేశించారు. తన చాంబర్‌లో శుక్రవారం ఆయన ఏడీలు, సూపరింటెండెంట్లతో సమీక్ష నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ సైన్స్‌సెంటర్ సందర్శనకు రోజూ విద్యార్థులు వచ్చేలా చూడాలని కలెక్టరు ఇప్పటికే ఆదేశించారన్నారు. బాలికలకు బస్సుల్లో ఉచితం కాబట్టి బాలురకు రవాణ చార్జీలను ఎస్ఎస్ఏ అందిస్తుందని, భోజనం ఇస్కాన్ ద్వారా సరఫరా చేస్తారన్నారు. విద్యార్థులు సైన్స్‌మ్యూజియం సందర్శనకు వచ్చినపుడు అక్కడికే కాకుండా నగరంలోని ఆర్కియాలజీసెంటర్, ఇతర టూరిజం ప్రాంతాలను సాయంత్రం వరకు చూపించాలని కలెక్టరు ఆదేశించారన్నారు. ఈమేరకు టూరిజంశాఖతో కలిసి ప్రత్యేక రూట్‌మ్యాప్ తయారు చేయాలని ఏడీలు, సూపరింటెండెంట్లకు డీఈఓ సూచించారు. విద్యార్థులు ఏయే మండలం ఏయే స్కూల్ నుంచి ఏరోజు వస్తారో కూడా ముందస్తుగా ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న గ్రీవెన్స్ ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలన్నారు. సమస్య పరిష్కారం అయిన వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని వీటిపై ఆయా సెక్షన్‌ల ఏడీలు, సూపరింటెండెంట్లు ప్రధాన బాధ్యత తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏడీలు మునీర్, శ్రీనివాసులు, సూపరింటెండెంట్లు ఆదినారాయణ, లక్ష్మీనారాయణ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే సత్ఫలితాలు

● ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి


ఏడీసీసీ బ్యాంకులో ప్రతిజ్ఞ చేస్తున్న చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, సీఈఓ, అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ అంకితభావం, నిబద్ధతతో పనిచేస్తేనే సత్ఫలితాలు వస్తాయని ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి తెలిపారు. 72వ జాతీయ సహకార వారోత్సవాలను శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ సహకార జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సహకార వ్యవస్థ పటిష్టంతోనే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం సహకార ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ సురేఖరాణి, డీజీఎంలు రాంప్రసాద్, సుఖదేవబాబు, విజయచంద్రారెడ్డి, సహకార విద్యాధికారి మురళీమోహన్, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జూడో ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి జూడో క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 16న ఆర్డీటీ స్టేడియంలోని జూడో అకాడమీలో నిర్వహించనున్నట్లు జిల్లా జూడో అసోసియేషన్ కార్యదర్శి గోవిందు తెలిపారు. అర్హత గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడాసామగ్రితో హాజరుకావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22 నుంచి కాకినాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు సెల్ నంబరు 9989195158ను సంప్రదించాలని కోరారు.

డీసీఈబీ కార్యదర్శిగా గోపాల్



కొత్తచెరువు, నవంబరు14(ఆంధ్రజ్యోతి): జిల్లా సాధారణ పరీక్షల విభాగ (డీసీఈబీ) కార్యదర్శిగా కొత్తచెరువు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌ను నియమించినట్లు డీఈఓ కిష్టప్ప శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం డీసీఈబీ కార్యదర్శిగా పనిచేస్తున్న భాస్కర్‌రెడ్డి పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో గోపాల్‌ను నియమించారన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరిస్తాం

● ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే పరిటాల సునీత



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్‌లో ప్రజలు వినతుల ద్వారా తెలిపిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఇందులో ప్రధానంగా భూసమస్యలు, పింఛన్లు, ఇంటిస్థలాలు, రోడ్లకు సంబంధించి ప్రజలు వినతిపత్రాలు ఇచ్చారు. వాటిని స్వీకరించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్హులకు పింఛన్లు, ఇంటిపట్టాలు త్వరలో అందజేస్తామన్నారు. మండల కేంద్రంలో భక్తకనకదాస విగ్రహ ఏర్పాటుకు, గీతామందిరం నిర్మాణానికి స్థలం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే వివిధ సమస్యలు పరిష్కరిస్తామని వివరించారు. తర్వాత ప్రసన్నాయపేటకు చెందిన డ్వాక్రా మహిళలు వచ్చి తమ రుణాలకు సంబంధించి రికవరీ సొమ్మును గ్రామానికి చెందిన క్రిష్టారెడ్డి అనే వ్యక్తి కాజేశాడంటూ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దాదాపు రూ.33లక్షలు స్వాహా చేశారని, న్యాయం చేయాలని ఆవేదనవ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ కృష్టారెడ్డి అనే వ్యక్తి ఎక్కడున్నా వెంటనే అరెస్టు చేయాలని, మహిళలకు అందాల్సిన సొమ్మును రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న టీడీపీ సీనియర్ నాయకుడు అంకే అంజనేయులును ఎమ్మెల్యేపరామర్శించారు. కార్యక్రమంలో రామగిరి సీఐ శ్రీధర్, ఈఓఆర్డీ అశోక్‌నాయక్, సీఎస్‌డీటీ గురుప్రసాద్, టీడీపీ సీనియర్ నేత ఎల్.నారాయణచౌదరి, కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లాఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



క్లాక్ టవర్ వద్ద కేక్ కట్‌చేస్తున్న బీజేపీ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బిహార్ సాధారణ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించడం పట్ల నగరంలోని బీజేపీ నాయకులు శుక్రవారం సంబరాలు చేశారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద కేక్‌కట్ చేసి, బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, స్టేట్ సెల్స్ కన్వీనర్ చిరంజీవిరెడ్డి, రాష్ట్ర అధికారప్రతినిధి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. బిహార్‌లో ప్రజలు మరోసారి అభివృద్ధికి పట్టం కట్టారని తెలిపారు. 200 స్థానాలకు పైగా ఎన్డీఏ గెలవడం శుభపరిణామమన్నారు. ఇక కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు అశోక్‌రెడ్డి, మైదుకూరు ఆంజనేయులు, శ్రీదేవి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, రత్నమయ్య, వసుంధర, లలిత్‌కుమార్, రఫీ, ఈశ్వర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం



కుట్టుశిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

రామగిరి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు గ్రామంలో టీడీపీ నాయకులు ఐసీఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి పలువురు మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు ఈ ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి కుట్టుమిషన్లను సైతం ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. మహిళలు స్వయం శక్తితో ఎదగాలని ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. ఈ శిక్షణ డీఆర్‌డీఏ వెలుగు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు రామ్మూర్తినాయుడు, మండల కన్వీనర్ సుధాకర్, వెలుగు ఏపీఎం అనసూయమ్మ, సీసీ కిష్టప్ప, ఐసీఎఫ్ చారిటబుల్ ట్రస్టు సభ్యుడు, సాగునీటిసంఘం చైర్మన్ లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ బడగొర్ల అంజనప్ప, సింగిల్ విండో మాజీ ప్రసిడెంట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక



టీడీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడాపురానికి చెందిన వైసీపీ నాయకులు పుట్టపర్తి పెద్దన్న, మల్లికార్జున, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, రాజేంద్ర, శ్రీదేవి తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం వారు ఎమ్మెల్యే పరిటాల సునీత సమక్షంలో పార్టీలోకి చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీలో కష్టపడే కార్యకర్తలకు, నాయకులకు తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. ప్రతిఒక్కరూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సీనియర్ నాయకుడు ఎల్.నారాయణచౌదరి, కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు, నాయకులు పసల పెద్ద వెంకటరాముడు, వెంకటేశ్, పక్కీరప్ప పాల్గొన్నారు.

'అభివృద్ధిలో సహకార వ్యవస్థ పాత్ర కీలకం'



మాట్లాడుతున్న అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సమాజం, దేశం అభివృద్ధిలో సహకార వ్యవస్థ పాత్ర కీలకమని అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్ పేర్కొన్నారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక శ్రీకృష్ణదేవరాయభవన్‌లో సహకార పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం సహకార సూత్రాలు, విలువల గురించి వివరించారు. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో సహకార వ్యవస్థ పటిష్టంగా ఉందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార వ్యవస్థ బలోపేతానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రామచంద్ర, సహకార విద్యాధికారి మురళీమోహన్, అర్బన్ బ్యాంకు వైస్ చైర్మన్ మాగిశెట్టి చంద్రశేఖర్, సీఈఓ విజయభాస్కర్, డైరెక్టర్లు , బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు

● ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
● జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ పిలుపు
● ఘనంగా వారోత్సవాలు ప్రారంభం



జిల్లా కేంద్రగ్రంథాలయంలో వారోత్సవాలను ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ

అనంతపురం విద్య, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించే భాండాగారాలు అని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో శుక్రవారం ఆయన అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలుత విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ ఉద్యోగులతో కలిసి నగరంలో ర్యాలీ చేశారు. అనంతరం గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పించి జ్యోతిప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు. తర్వాత మాట్లాడుతూ సమాజ చైతన్యం కోసం ఆది నుంచి గ్రంథాలయాలు ప్రధానపాత్ర పోషిస్తూ వస్తున్నాయన్నారు. ప్రస్తుతం నిరుద్యోగ యువతకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచుతూ పోటీపరీక్షలకు ఎంతగానో తోడ్పాటునందిస్తున్నాయన్నారు. ఇలాంటి గ్రంథాలయాల సేవలను నిరుద్యోగ యువతతోపాటు అన్ని వర్గాలప్రజలు సద్వినియోగం చేసకోవాలని జేసీ పిలుపునిచ్చారు. వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని గ్రంథాలయ ఉద్యోగులకు సూచించారు. సమావేశంలో జిల్లాగ్రంథాలయ కార్యదర్శిరమ, డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి, డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న, అసిస్టెంట్ లైబ్రేరియన్ గోవింద్, కేఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ, కవి రామలింగయ్య, రిటైర్డ్ టీచర్ శ్రీరాములు, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి: ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి: గ్రంధాలయాలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని, వాటిని ప్రతిఒక్కరు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. చెన్నేకొత్తపల్లిలోని శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అలాగే విద్యార్థులతో కలిసి జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలన్నారు. చెన్నేకొత్తపల్లిలో టీడీపీ హయాంలో రూ.25లక్షల నిధులతో గ్రంథాలయ భవనాన్ని నిర్మించామని గుర్తు చేశారు. ప్రతి మండలంలోనూ గ్రంథాలయ భవనాలు ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. నేటి నుంచి 20వతేదీ వరకు నిర్వహించే వారోత్సవాలలో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేయాలని అక్కడి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్.నారాయణచౌదరి, గ్రంధాలయఅధికారి జయరాం, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ లక్ష్మీనరసమ్మ, మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర పాల్గొన్నారు.

సహస్ర శంఖాభిషేక వేడుకలు ప్రారంభం



లక్షబిళ్వార్చన చేస్తున్న అప్పాస్వామి బృందం

అనంతపురం టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శివకోటి మందిరంలో శుక్రవారం మహారుద్ర - సహస్ర శంఖాభిషేక వేడుకలను అట్టహాసంగా ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మొదటి రోజున ఆలయ ఆవరణలో శివకోటి పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు అప్పాస్వామి నేతృత్వంలో వేదపండితులు వేద మంత్రోచ్చారణల నడుమ కళాన్యాస పూర్వక శివలింగ చరప్రతిష్ఠ, మహన్యాస పూర్వక మహారుద్రాభిషేకం, శివకామేశ్వరస్వామికి అన్నాభిషేకం, లక్షబిళ్వార్చన చేశారు. అలాగే శివకామేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. తర్వాత సాయంత్రం ఆలయ ఆవరణలో కలశారాధనలు, మహాగౌరీపూజ, లలితాసహస్రనామ పారాయణాలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు సభ్యులు అమర్, నరసింహం, ప్రధానార్చకుడు హరికృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



బహుమతులు సాధించిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

అనంతపురంరూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మండలంలోని ఇటుకపల్లి వద్ద ఉన్న అనంతలక్ష్మీ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ అనంతరాముడు సూచించారు. ఆ స్కూల్‌లో గురువారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు నెహ్రూ వేషధారణలో అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. తర్వాత స్పోర్ట్ మీట్ నిర్వహించారు. పాఠశాల చైర్మన్ అనంతరాముడు, కరెస్పాండెంట్ రమేష్‌నాయుడు హాజరై ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు. అనంతరం మాట్లాడారు. విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. కార్యక్రమంలో సీఏఓ నరసింహారావు, హెచ్‌ఎం శాలిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్



వినతులు స్వీకరిస్తున్న కార్పొరేషన్ల డైరెక్టర్లు, నాయకులు

అనంతపురం క్రైం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులు శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశాలతో పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు పోతుల నరసింహులు, పరమేశ్వర్, పీఎల్ఎన్ మూర్తి, కడియాల కొండన్న, నాయకులు నెట్టం బాలకృష్ణ ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. తర్వాత నాయకులు మాట్లాడుతూ.. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు.

'మణికంఠపై ఆరోపణలు అవాస్తవం'

అనంతపురం టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : చెరువుకట్టపై వెలసిన అయ్యప్పస్వామి ఆలయ వివాదంలో స్పష్టత వచ్చిందని, ఆలయ కమిటీ అధ్యక్షుడు బుట్నా గౌతమ్‌పై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని సాయి అయ్యప్ప సేవా సమాజ్ కార్యదర్శి నాగలింగారెడ్డి పేర్కొన్నారు. అయ్యప్పస్వామి ఆలయం వద్ద శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కొందరు అయ్యప్పస్వామి ఆలయ కమిటీ విషయంలో అనేక విధాలుగా ఆరోపణలు చేశారన్నారు. అయితే అవన్నీ అవాస్తవమని, కమిటీ అధ్యక్ష స్థానంలో ఉన్న మణికంఠ రికార్డులన్నీ సక్రమంగా ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే కోర్టు నుండి స్టేటస్ అండ్ కో తీర్పు వచ్చిందని తెలిపారు. గతంలో ఆరోపణల దృష్ట్యా రికార్డులన్నీ పరిశీలించడం జరిగిందని, ఎక్కడా అక్రమాలు జరిగినట్లు నిరూపణ కాలేదని అన్నారు. గతంలో అవిశ్వాస తీర్మానం పెడితే కేవలం నలుగురు సభ్యులు మాత్రమే ఆమోదించారని, ఈ అవిశ్వాస తీర్మానం రద్దు చేస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రకటించారని చెప్పారు. దీంతో అయ్యప్పస్వామి ఆలయ వివాదం ముగిసిందన్నారు. దీనిపై ఇకనుంచి ఎలాంటి ఆరోపణలు చేయడానికి వీలులేదని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు బుట్నా మణికంఠ మాట్లాడుతూ... ఈనెల 17 నుంచి అయ్యప్పస్వామి ఆలయంలో మండల పూజా కార్యక్రమాలు యథావిధిగా జరుగుతాయని పేర్కొన్నారు. బీజేపీ నాయకుడు వీరాంజనేయులు, ఆలయ శాశ్వత భక్తులు పాల్గొన్నారు.

కబడ్డీ రన్నరప్ శ్రీవాణి డిగ్రీ కళాశాల

అనంతపురం రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఇంటర్ కబడ్డీ టోర్నమెంట్ రన్నరప్‌గా కక్కలపల్లి క్రాస్ శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాల జట్టు నిలిచింది. కళ్యాణదుర్గంలో శుక్రవారం జరిగిన ఫైనల్‌లో ఆర్ట్స్ కళాశాల, శ్రీవాణి కళాశాల జట్లు తలపడ్డాయి. ఇందులో శ్రీవాణి కళాశాల జట్టు రన్నరప్‌గా నిలిచింది. తద్వారా జట్టుసభ్యులు ముఖ్యఅతిథుల చేతులమీదుగా కప్పును అందుకున్నారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్‌రెడ్డి, సీఈఓ సుధాకర్, ఫిజికల్ డైరెక్టర్ ఆంజనేయులు, లక్ష్మీ అభినందించారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అభినందనలు

అనంతపురం రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):ప్రీ రిపబ్లిక్ పరేడ్ క్యాంపులో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు హర్షితోదయ, కృష్ణతోపాటు ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అపర్ణను జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య అభినందించారు. శుక్రవారం జేఎన్‌టీయూఏ పరిపాలన భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వలంటీర్లను వారు అభినందించారు. కార్యక్రమంలో ఓఎస్‌డీటూ వీసీ ఆచార్య దేవన్న, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శారద తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైం పట్ల అప్రమత్తంగా ఉండాలి



మనోప్రియను అభినందిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సైబర్‌క్రైం, డిజిటల్ అరెస్టు పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శివప్రియ వెల్ఫేర్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, మెప్మా సీఓ మనోప్రియ సూచించారు. హైదరాబాద్ సమీపంలోని మేడ్చల్ పీటీసీలో ఉమ్మడి రాష్ట్రాల తరపున సైబర్‌మేధా ఏఐ ప్రోగ్రాం జరిగింది. ఇందులో మనోప్రియ శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె నగరంలో ఎస్పీ జగదీష్‌ను కలవగా ఆయన అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సైబర్ క్రైం, డిజిటల్ అరెస్టులతో జరుగుతున్న మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వీటిపై జిల్లాలోని విద్యాసంస్థలు, కార్యాలయాలు తదితర వాటిలో అవగాహన కల్పించేందుకు పని చేస్తామని చెప్పారు.

ఏఎంసీలో వైర్లు కత్తిరించిన వ్యక్తి అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీకాంత్ యాదవ్

అనంతపురం క్రైం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వాసుపత్రిలోని ఎమర్జెన్సీ వార్డులో కరెంటు వైర్లు కట్ చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. ఈ నెల 10వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో ఎమర్జెన్సీ వార్డులో కరెంటు వైర్లు కట్ చేసి విద్యుత్ సరఫరాలో అంతరాయానికి కారణమైన వ్యక్తిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ ఫిర్యాదు చేశారన్నారు. ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు సీఐ చెప్పారు. కరెంట్ కట్ చేసి రోగులకు, వైద్యులకు ఇబ్బందులు కలుగజేసిన వ్యక్తి స్టాలిన్ నగర్‌కు చెందిన పేరపాగు అనిల్ జోషి అలియాస్ అనిల్ అని గుర్తించినట్టు పేర్కొన్నారు. అతడిని శుక్రవారం అరెస్టు చేసి కాపర్ వైర్‌ను రికవరి చేసినట్టు తెలిపారు. తర్వాత రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపర్చగా.. న్యాయాధికారి 14 రోజుల రిమాండ్ విధించారని సీఐ పేర్కొన్నారు.

కార్తీక వనమహోత్సవానికి తరలిరండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భట్రాజుల సంక్షేమ సంఘం నాయకులు

అనంతపురం టౌన్/ప్రెస్‌క్లబ్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా భట్రాజుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన కార్తీక వన మహోత్సవం జరగనుందని, ఉమ్మడి అనంత జిల్లాలోని భట్రాజు సామాజికవర్గ ప్రజలు విరివిగా తరలిరావాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యల్లమరాజు బాలాజీ పిలుపునిచ్చారు. స్థానిక సంఘం జిల్లా కార్యాలయలో శుక్రవారం ఆయన ఈ మేరకు పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ... అనంతపురం నగర శివారులోని నేషనల్ పార్కులో ఆదివారం చేపట్టే వన భోజన మహోత్సవంలో కార్తీక పూజలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బట్టు మనోహర్ కుమార్, కోశాధికారి అక్కిరాజు మారుతీరాజు, ఉపాధ్యక్షుడు భీమరాజు శ్రీనివాసరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దిగొచ్చేదాకా పోరాడతాం: వైసీపీ



సంతకాల సేకరణలో పాల్గొన్న అనంత వెంకటరామిరెడ్డి తదితరులు

అనంతపురం రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ విషయంలో ప్రభుత్వం దిగొచ్చేవరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట రామిరెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని ఎ. నారాయణపురం పంచాయతీ తపోవనం సర్కిల్లో పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మెడికల్ కాలేజీల ప్రైవేటు పరం కావడాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ జరిగింది. కార్యక్రమానికి అనంత వెంకటరామిరెడ్డి హాజరై నాయకులు, కార్యకర్తలతో సంతకాలు సేకరించారు. అనంతరం మాట్లాడుతూ.. జగన్ హయంలో 17ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టి ఏడు కళాశాలలు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన 10కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమన్నారు. దీనిని ప్రజలంతా ముక్తకంఠంతో ఖండిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ విజయవంతంగా కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ క్రాప్ బుకింగ్ చేస్తేనే పరిహారం

గార్లదిన్నె, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సాగుచేసిన పంటలకు ఈ క్రాప్ బుకింగ్ చేయిస్తేనే ఏదేని పరిహారం వర్తిస్తుందని ఏఓ సోమశేఖర్ సూచించారు. మండలంలోని కోటంక రైతు సేవాకేంద్రంలో శుక్రవారం ఆయన రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఖరీఫ్ సాగులో సాగుచేసిన వివిధ పంటలకు తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేయించాలన్నారు. అలా అయితేనే ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోతే ప్రభుత్వం అందజేసే పరిహారం వర్తిస్తుందని తెలిపారు. సర్పంచు ఎర్రిస్వామి, ఏఈఓ హరిబాబు, వీఏఏ అశ్విని పాల్గొన్నారు.

నేడు శేషంపల్లిలో కనకదాస జయంతి

రామగిరి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని శేషంపల్లిలో శనివారం భక్త కనకదాస జయంతిని నిర్వహించనున్నట్టు గ్రామ కురుబ సంఘం నాయకులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కురుబ కులస్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

కనగానపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కనగానపల్లి రెగ్యులర్ ఎంపీడీఓగా వెంకటాచలపతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ రెగ్యులర్ ఎంపీడీఓ లేక పోవడంతో ఈఓఆర్డీ అనిల్‌కుమార్ ఇన్‌చార్జిగా కొనసాగారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న వెంకటాచలపతి ఉద్యోగోన్నతి పొంది అక్కడే ఎంపీడీఓగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అతడికి ఈఓఆర్డీ అనిల్‌కుమార్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా జవహర్‌లాల్ నెహ్రూ జయంతి

● పలువురి నివాళి



ఎస్కేయూలో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెక్టార్ వెంకటనాయుడు తదితరులు



గార్లదిన్నె మండలం మర్తాడులో నివాళులర్పిస్తున్న భవాని రవికుమార్, అధికారులు

అనంతపురంరూరల్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): భారత దేశ మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని జిల్లా కేంద్రంలోని ఎస్కేయూనివర్సిటీలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు తదితరులు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆధునిక విద్యకు పునాది వేసిన గొప్ప నాయకుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ కొనియాడారు. ఆయన స్వప్నించిన శాస్త్రీయ సాంకేతిక భార తం వైపు దేశం వేగంగా పయనిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మునినారాయణప్ప, కార్యక్రమ కన్వీనర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణుడు, వివిధ విభాగాల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాలయాల్లో బాలల దినోత్సవం

●అనంతపురం విద్య/టౌన్ బాలల దినోత్సవం సందర్భంగా నగరంలోని గుత్తిరోడ్డు, సంగమేష్ సర్కిల్లో గల మాంటిస్సోరి విద్యాసంస్థల్లో, బళ్లారి బైపాస్ సమీపంలో ఉన్న ట్రెల్లిస్ స్కూల్లో, అశోక్‌నగర్‌లో గల శ్రీసాయి విద్యానికేతన్ స్కూల్లో, అలాగే క్రీసెంట్ రెయిన్‌బో హోమ్‌లో చిన్నారులు మహనీయుల వేషధారణలలో సందడి చేసి అలరించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి నృత్యాలు చేశారు. అంతకు ముందు పాఠశాలల కరెస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు, టీచర్లు జవహర్‌లాల్ నెహ్రూచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

●గార్లదిన్నె: మండలంలోని మర్తాడు గ్రామంలో గల విద్య చైతన్య స్కూల్లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యక్రమాల కమిటి కార్యదర్శి భవాని రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ... పిల్లలు చిన్నప్పటి నుంచే క్రమ శిక్షణతో మెలగాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పట్ల గౌరవభావం అలవార్చుకోవాలన్నారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ తారా చంద్రానాయక్, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి దివే కృష్ణమూర్తి, కమిటీ మెంబరు రమణ, మండల ఉపాధ్యక్షుడు జిలకర సోమశేఖర్, అధ్యక్షుడు తాతయ్య ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

●కనగానపల్లి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రంథాలయంలో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి గ్రంథాలయధికారిణి నాగమణి పూలమాలల వేసి నివాళులర్పించారు. కేజీబీవీలో విద్యార్థినులకు పలు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.



గుత్తిరోడ్డులోని మాంటిస్సోరి స్కూల్లో చిన్నారుల సందడి



మినర్వా స్కూల్లో..



క్రీసెంట్ రెయిన్‌బో హోంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

న్యూస్ బాక్స్

మహిళా క్రికెట్ జట్టు ట్రైనింగ్ అసిస్టెంట్‌కు సన్మానం



క్రాంతికుమార్‌ను సన్మానిస్తున్న సభ్యులు

గుంతకల్లుటౌన్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): భారత మహిళా క్రికెట్ జట్టుకు ట్రైనింగ్ అసిస్టెంట్ క్రాంతికుమార్‌ను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్‌కుమార్ గౌడ్, క్రికెటర్లు సన్మానం చేశారు. క్రాంతికుమార్ భారత మహిళా క్రికెట్ జట్టును విశ్వవిజేతగా అవతరించడంలో కీలకపాత్ర పోషించిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం గుంతకల్లుకు విచ్చేసిన కాంత్రికుమార్‌ను స్థానిక ఇండియన్ స్కూల్‌కు పవన్‌కుమార్ గౌడ్ ఆహ్వానించి.. సన్మానించారు. ఇందులో టీడీపీ యువ నాయకులు అనిల్ గౌడ్, రంజీ క్రీడాకారుడు గులాం, క్రికెట్ అభిమానులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

రాయదుర్గంరూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2005-08లో టెన్త్ చదివిన విద్యార్థులు ఆ కళాశాలలో సరస్వతిదేవి విగ్రహాన్ని శుక్రవారం ప్రతిష్ఠించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు సుమంగళి, కాంట్రాక్టర్ రమేష్, భాస్కర్ ఆర్థిక సాయం చేయడంతో కళాశాలలో అసంపూర్తిగా ఉన్న స్టేజ్ నిర్మాణాన్ని పూర్తి చేశామన్నారు.

పరంజ్యోతి విగ్రహం...



హోమంలో పాల్గొన్న భక్తులు

రాయదుర్గం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక కల్కిభగవాన్ ఆలయంలో పరంజ్యోతి విగ్రహ ప్రతిష్ఠను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహాగణపతి, నవగ్రహ, సుదర్శన హోమాలను నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులు జయంతి రాధాకృష్ణ, జయంతి రమేష్, లాయర్ నరసింహప్రసాద్ పాల్గొన్నారు.

నాగదేవతల విగ్రహాలు..



పూజలో పాల్గొన్న భక్తులు

కుందుర్పి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక చెరువు కట్ట కింద నాగదేవతల విగ్రహాలను పునఃప్రతిష్ఠించే కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన తలారి రమేష్ దంపతులు ఈ విగ్రహాలను ప్రతిష్ఠించారు.

'మాజీ మంత్రి వాస్తవాలు తెలుసుకోవాలి'

పుట్లూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలానికి హెచ్చెల్సీ నీరు తెప్పించే విషయంలో వైసీపీ నేత, మాజీ మంత్రి శైలజానాథ్ వాస్తవాలు తెలుసుకోవాలని కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ సుదర్శన్ నాయుడు, మాజీ మండల కన్వీనర్ శివశంకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శైలజానాథ్ వల్లే హెచ్చెల్సీకి నీళ్ల వదిలారని వైసీపీ సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. హెచ్చెల్సీ అధికారులతో మాట్లాడి నీరు తెప్పించిన ఘనత ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకే దక్కుతుందన్నారు. వైసీపీ అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు.

తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్



కూడేరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కూడేరు నుంచి కడదరకుంటకు వెళ్లే దారిలో ఇలా తక్కువ ఎత్తులోనే.. ఎలాంటి రక్షణ కంచె లేకుండా విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. పశువులు దానికి తగిలి.. చనిపోయే ప్రమాదముంది. అంతేకాకుండా బోరు సమీపంలోనే ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో.. బోరు మోటర్ రిపేరి వస్తే, పైపులు తొలగించే సమయంలో పొరపాటు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలితే ఘోర ప్రమాదం జరిగే అకాశముంది. అధికారులు ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తులో ఉంచి.. రక్షణ కంచె ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

వార్షిక మహాసభ

బెళుగుప్ప, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు రవితేజ మండల సమాఖ్య కార్యాలయంలో వ్యవసాయం అనుబంధ మహిళా రైతు ఉత్పత్తుదారుల సహకార సంఘం వార్షిక మహాసభను శుక్రవారం నిర్వహించారు. టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ.. పంటల సాగు పెట్టుబడులకు రుణసౌకర్యం లభిస్తుందన్నారు. ఇందులో ఏపీఎం సురేఖ మండల సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యమ్మ, టీడీపీ నాయకులు తిమ్మప్ప, గోవిందు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున

స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యం

మండల కన్వీనర్ల ప్రమాణ స్వీకారోత్సవంలో విప్ కాలువ



ప్రమాణస్వీకారం చేయిస్తున్న విప్ కాలవ, సన్నన్నను సన్మానిస్తున్న మాజీ కన్వీనర్ గిరిమల్లప్ప

రాయదుర్గం, నవంబరు14(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులే విజయం సాధించాలని, ఇప్పటి నుంచే ఆ బాధ్యతను ప్రతి ఒక్కరూ భుజస్కంధాలపై వేసుకోవాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం మద్దానేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నూతన కన్వీనర్ల ప్రమాణస్వీకార మహోత్సవాన్ని నిర్వహించారు. అంతకుముందు పట్టణంలోని శాంతినగర్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడి నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పార్టీశ్రేణులు, నాయకులు బైక్‌ర్యాలీ నిర్వహిస్తూ.. మద్దానేశ్వర స్వామి ఆలయం వద్దకు చేరారు. ఈ సందర్భంగా కణేకల్లు మండల కన్వీనర్‌గా వన్నారెడ్డి, రాయదుర్గం పట్టణ కన్వీనర్‌గా బండి క్రిష్ణమూర్తి, డీ.హీరేహాళ్ మండల కన్వీనర్‌గా కాదలూరు మోహన్‌రెడ్డి, గుమ్మఘట్ట కన్వీనర్‌గా కాలవ సన్నన్నలతో పాటు క్లస్టర్ ఇన్‌చార్జులు, బూత్ కన్వీనర్లతో విప్ ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ హాజరయ్యారు. విప్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి డిపాజిట్లు కూడా రాకుండా కలిసికట్టుగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో యువనాయకుడు కాలవ భరత్, మార్కెట్‌యార్డ్ చైర్మెన్ హనుమంతరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు పొరాళు పురుషోత్తం, నాగల్లి రాజు, ఆనంద్‌రాజ్, నాయకులు గిరిమల్లప్ప, పసుపులేటి నాగరాజు, బలరాంరెడ్డి, కురుబ హనుమంతు, లాలెప్ప పాల్గొన్నారు.

● **కన్వీనర్ సన్నన్న భారీ ర్యాలీ**

గుమ్మఘట్ట: గుమ్మఘట్ట టీడీపీ మండల కన్వీనర్‌గా కాలవ సన్నన్న శుక్రవారం ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి తెలుగుతమ్ముళ్లు ద్విచక్రవాహనాలపై భారీ ర్యాలీగా తరలివెళ్లారు. మండలంలోని 75 వీరాపురం గ్రామం నుంచి సన్నన్నను భారీగా స్వాగతం పలికారు. ప్రమాణస్వీకారం అనంతరం కాలవ సన్నన్నను పలువురు సన్మానించారు.

'ప్రజావేదిక గ్రీవెన్స్'కు సమస్యల వెల్లువ



దివ్యాంగుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక పజావేదికలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శుక్రవారం నిర్వహించిన ప్రజావేదిక గ్రీవెన్స్‌కు సమస్యలు వెల్లువెత్తాయి. నియోజకవర్గంలోని అన్ని మండలాలు.. అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి అర్జీదారుడితో ఎమ్మెల్యే మాట్లాడారు. సమస్యలను యాప్‌లో నమోదు చేయించారు. ఎప్పటిలోగా ఆ సమస్యను పరిష్కరిస్తారో అధికారులతో అర్జీదారులకు చెప్పించారు. సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు గ్రామాల్లో పర్యటించి.. భూములు, పింఛన్ల సమస్యలు పరిష్కరించాలన్నారు.

● **ప్రమాణ స్వీకారం**: నియోజకవర్గంలోని అన్ని మండలాల గ్రామ కన్వీనర్లు, గ్రామ కమిటీ సభ్యులు, క్లస్టర్లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు స్థానిక ప్రజావేదికలో ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, టీడీపీ పార్టీ అబ్జర్వర్ నాగేశ్వరయాదవ్, టీడీపీ సీనియర్ నాయకుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

● **ఎమ్మెల్యేకు సన్మానం** : కనకదాసు విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేశారంటూ నియోజకవర్గంలోని కురుబలు, టీడీపీ నాయకులు ఎమ్మెల్యే అమిలినేనిని శుక్రవారం ఘనంగా సన్మానించారు.

● **చెక్కుల అందజేత**: నియోజకవర్గంలోని 43 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.32.56 లక్షలు మంజూరైంది. ఆ చెక్కులను ఎమ్మెల్యే ప్రజావేదిక వద్ద అందజేశారు.

అత్యవసర కౌన్సిల్ సమావేశం

తాడిపత్రి, నవంబరు14(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ వైస్‌చైర్మన్ అరుణ అధ్యక్షతన మున్సిపల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయానికి సౌరవిద్యుత్ ప్యానెల్‌ను స్థాపించుటకు ప్రతిపాదనలు గుంటూరు జిల్లా వారికి సిఫారసు చేశారు. అలాగే పలు అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు.

ప్రజాదర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే

గుంతకల్లు టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక చక్ర అపార్ట్‌మెంట్‌లో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యలపై పలు ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



అర్జీ స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు

వీఆర్ఏ భవనం ప్రారంభం



వీఆర్ఏలతో జిల్లా తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ

పెద్దవడుగూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో నిర్మించిన వీఆర్ఏల విశ్రాంతి భవనాన్ని తహసీల్దార్ ఉషారాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ దివాకర్‌రెడ్డి పాల్గొని తన వంతు సాయంగా రూ. లక్షను వారికి అందజేశారు. కార్యక్రమంలో వీఆర్ఏ కిరణ్, పుల్లన్న, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

శెట్టూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖైరేవు, చెర్లోపల్లి, యర్రబోరేపల్లి, లక్ష్మంపల్లి, కంబాలపల్లి, మాకొడికి పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రాష్ట్ర కార్యదర్శి కే క్రిష్ణమూర్తి శుక్రవారం చేపట్టారు. ఇందులో ఎస్టీయూ శెట్టూరు మండల నాయకులు మల్లికార్జునగౌడ, రామ్ శేఖర్, మంజునాథ, రాజశేఖర్, మంజువాణీ పాల్గొన్నారు.

● బొమ్మనహాళ్ : మండలంలోని శ్రీధరఘట్ట ప్రభుత్వ పాఠశాలలో ఎస్‌టీయూ సభ్యుత్వ నమోదు కార్యక్రమాన్ని రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సూర్యుడు శుక్రవారం చేపట్టారు. ఇందులో నాయకులు బాబ్జినాయక్, వెంకటేష్, కాళిదాసు, రాజు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

జోరుగా మట్కా.. పేకాట

మామూళ్ల మత్తులో తాడిపత్రి పోలీసులు



తాడిపత్రి పట్టణ పోలీస్ స్టేషన్

తాడిపత్రి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు జిల్లాలోనే మట్కా నిర్వహణలో తాడిపత్రి టాప్. దినదినాభివృద్ధి చెంది ప్రస్తుతం రాయలసీమలోనే టాప్‌గా నిలిచింది. ముంబై తర్వాత తాడిపత్రి, ప్రొద్దుటూరే ఉన్నాయని అనడంలో ఎలాంటి సందేహమూ లేదు. అప్పట్లో రూ.లక్షల్లో టర్నోవర్ జరిగేది. ప్రస్తుతం మట్కా ఆడే వారి సంఖ్య పెరగడంతో టర్నోవర్ కూడా రూ.కోట్లకు చేరింది. ప్రొద్దుటూరు, నంద్యాల, కడప తదితర పట్టణాల నుంచి ఇక్కడకు వచ్చి లాడ్జీలు తీసుకొని మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం. పట్టపగలే ఎక్కడబడితే అక్కడ పేకాట స్థావరాలు వెలుస్తున్నాయి. పట్టణంలో కొన్నిచోట్ల ఇళ్లల్లోనే మట్కా, పేకాట నిర్వహిస్తున్నారు. మట్కా ఆడేవారు గతంలో లాగా నేరుగా మట్కాబీటర్ల వద్దకు వెళ్లకుండా వాట్సాప్, ఆన్‌లైన్‌ను ద్వారా సంప్రదిస్తున్నారు. కొందరి పోలీసుల నిర్లక్ష్యం.. మరికొందరు మామూళ్ల మత్తులో ఉండటంతో మట్కా, పేకాట నిర్వహకుల వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయల్లా సాగుతోంది. తాడిపత్రి ప్రాంతంలో పరిశ్రమలు ఎక్కువగా ఉండడంతో బతుకుదెరువు కోసం ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వందల సంఖ్యలో కూలీలు వలసవచ్చి ఇక్కడ జీవనం సాగిస్తున్నారు. కార్మికులు సంపాదించిన కూలి డబ్బులను సాయంత్రం అయ్యేసరికి అధిక డబ్బులకు ఆశపడి మట్కా ఆడేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో సంపాదించిన డబ్బులు మొత్తం పొగొట్టుకొని అప్పుల పాలవుతున్నారు. దీంతో కుటుంబ పోషణ కూడా కష్టమవుతోంది. కుటుంబాలతో సహా వీధిన పడుతున్నారు. పోలీసులు నామమాత్రపు దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప పూర్తిస్థాయిలో అరికట్టేలా చర్యలు తీసుకోవడం లేదు.

నిఘా ఉంచాం

పట్టణ, పరిసర ప్రాంతాల్లో మట్కా, పేకాట నిర్వహించకుండా నిఘా ఉంచాం. దాడులు చేసి పలువురిని అరెస్ట్ చేశాం. త్వరలో మరిన్ని దాడులు చేస్తాం. నేను ఇక్కడికి వచ్చిన నెల రోజుల్లో దాదాపు రూ. ఆరేడు లక్షలు స్వాధీనం చేసుకున్నాం. 20 మంది పైన కేసులు పెట్టి బైండోవర్ కూడా చేశాం. బస్టాండ్ వద్ద లాడ్జిని లీజుకు తీసుకొని మట్కా నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్ట్‌చేశాం. అతన్ని జిల్లా బహిష్కరణ చేస్తాం. ఎక్కడైనా మట్కా, పేకాట నిర్వహిస్తుంటే.. ప్రజలు మాకు సమాచారం ఇవ్వాలి. వారి పేర్లను మేం గోప్యంగా ఉంచుతాం. ప్రజల సహకారంతో వీటిని పూర్తిగా అడ్డుకోవచ్చు.

- ఆరోహణరావు, సీఐ



బాలల దినోత్సవం సందర్భంగా తాడిపత్రిలోని పద్మవాణి పాఠశాల, కణేకల్లులోని శ్రీవిద్యానికేతన్ పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధులు, నెహ్రూ వేషధారణలతో చిన్నారులు శుక్రవారం ఇలా అలరించారు.

తాళం తీయని సచివాలయాలు

యాడికి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం పలు సచివాలయాలకు తాళం కూడా తీయలేదు. తాడిపత్రిలో బీఎల్‌ఓల సమావేశం ఉండడంతో సిబ్బంది మొత్తం అక్కడకు వెళ్లారు. శుక్రవారం సదరం స్లాట్ బుకింగ్ ఓపెన్ కావడంతో అనేక మంది సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు. మధ్యాహ్నం వరకూ సచివాలయాల తాళం కూడా తీయకపోవడంతో వారు నిరాశతో వెనుతిరిగారు. దీనిపై డిప్యూటీ ఎంపీడీఓ శశికళను వివరణ కోరగా.. సచివాలయ సిబ్బంది బీఎల్‌ఓల శిక్షణకు వెళ్లారనీ, సచివాలయాలకు తాళాలు వేసి వెళ్లకూడదని, కనీసం ఒకరైనా అందుబాటులో ఉండాలని, ఎందుకు అలా జరిగిందో విచారిస్తామని తెలిపారు.

● **సర్వర్ మొరాయింపు**

బెళుగుప్ప: మండలంలో నిర్వహించిన సదరం క్యాంపునకు వచ్చిన దివ్యాంగులు సర్వర్ పనిచేయకపోవడంతో ఇబ్బంది పడ్డారు. బెళుగుప్ప సచివాలయంలో దివ్యాంగులు ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు గంటల తరబడి వేచి ఉన్నా.. సర్వర్ మొరాయించడంతో వెనుదిరిగారు.



యాడికిలో మూసివున్న సచివాలయం, బెళుగుప్పలో సర్వర్ మొరాయింపుతో నిరీక్షిస్తున్న దివ్యాంగులు

క్రైం న్యూస్..

వీఆర్వోపై దాడి

తాడిపత్రి, నవంబరు14(ఆంధ్రజ్యోతి): మండలంలోని భోగసముద్రం పంచాయతీ వీఆర్వో రామాంజనేయులుపై శుక్రవారం గుర్తుతెలియని దుండగులు దాడి చేశారు. ఆలూరు గ్రామానికి చెందిన రామాంజనేయులు ఈయన ఎప్పటిలాగే భోగసముద్రానికి వెళ్తుండగా... బైపాస్‌రోడ్డులోని ఆలూరు గ్రామం సమీపంలో కారులో వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు అతనిపై దాడి చేశారు. దీనిపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పాము కాటుతో అస్వస్థత

గుత్తిరూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన భాగ్యమ్మ తోటలో గడ్డి తొలగిస్తుండగా శుక్రవారం పాము కాటుకు గురైంది. తోటి కూలీలు ఆమెను వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు.

మట్కా బీటర్ల అరెస్ట్

వజ్రకరూరు (ఉరవకొండ), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల గ్రామంలో ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగస్వామి శుక్రవారం తెలిపారు. వారి నుంచి రూ.11,200 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సిద్దలాపురంలో ఫీడర్ ప్రారంభం



ఫీడర్‌ను ప్రారంభిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

కూడేరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలం సిద్దలాపురం సబ్‌స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఫీడర్‌ను విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సబ్‌స్టేషన్ నుంచి కూడేరు మండలంలోని ఎంఎంహళ్లి గ్రామంతో పాటు తోటలకు విద్యుత్ సరఫరా సరఫరా అయ్యేది. విద్యుత్ ఓవర్‌లోడు సమస్యతో ఎంఎంహళ్లి గ్రామస్థులు ఇబ్బందులు పడేవారు. దీంతో స్థానికులు, రైతులు ఈ సమస్యను మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాల మేరకు దాదాపు రూ.36 లక్షలతో నూతన విద్యుత్ లైన్‌తోపాటు సిద్దలాపురం సబ్‌స్టేషన్‌లో ఫీడర్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. దీన్ని శుక్రవారం ప్రారంభించడంతో విద్యుత్ సమస్య పరిష్కరించినట్లైంది. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ రమేస్, ఏడీ రవిశంకర్, కూడేరు ఏఈ గౌసమెద్దీన్, ఆత్మకూరు ఏఈ బండి దాస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూల్‌గా చేయాలి



యాడికిలో వినతిపత్రంతో అంగన్‌వాడీ సిబ్బంది

యాడికి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రీ స్కూల్‌గా అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని పలువురు అంగన్‌వాడీలు కోరారు. ఈ మేరకు శుక్రవారం పలువురు చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది సచివాలయం వద్ద వినతిపత్రాన్ని ప్రదర్శించారు. మూడు నుంచి ఆరు సంవత్సరాలలోపు పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఉండేలా ప్రభుత్వం జీఓ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది మహాలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

● గుంతకల్లుటౌన్ : అంగన్‌వాడీ సెంటర్లను ప్రీ స్కూల్‌గా బలోపేతం చేయాలని కోరుతూ పట్టణంలోని అన్ని సచివాలయాల్లో అంగన్‌వాడీ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యదర్శి రేష్మా, సీఐటీయూ పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, వర్కర్లు పెద్దక్క, సరోజ, హేమలత పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు మార్చండి

కణేకల్లు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కణేకల్లు క్రాసింగ్‌లోని విద్యానికేతన్ స్కూల్ ఎదురుగా ఇంటి స్థలాల్లో విద్యుత్ తీగలు ఏర్పాటు చేశారని, వాటిని మార్చాలని పలుమార్లు విద్యుత్ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు. మారుతిప్రసాద్, పర్వత్‌రెడ్డి, రవీంద్ర, సురేష్ మాట్లాడుతూ.. తమ స్థలాల మీదుగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడంతో ఇళ్లను నిర్మించుకోలేకపోతున్నామని వాపోయారు. అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఇళ్లస్థలాలపై వెళ్లిన విద్యుత్ తీగలు

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓలు

విడపనకల్లు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓగా రాధాక్రిష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇతను కూడేరు మండలంలో డిప్యూటి ఎంపీడీఓ (ఈఓఆర్డీ)గా విధులు నిర్వహించేవారు. పదోన్నతిపై ఎంపీడీఓగా ఇక్కడికి వచ్చారు.



రాధాక్రిష్ణ, రత్నాబాయ్

● పెద్దపప్పూరు : ఎంపీడీఓగా రత్నాబాయ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాపరిషత్ పరిపాలన అధికారిగా పనిచేస్తున్న ఆమె.. ఉద్యోగోన్నతిపై ఇక్కడికి ఎంపీడీఓగా వచ్చారు.

రేపు కంటి వైద్య శిబిరం

ఉరవకొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంతి ఉద్యోగుల భవనంలో ఆదివారం సుశీల నేత్రాలయం, సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కిష్టప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ఈ శిబిరం ఉంటుందన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న వారికి కంటి ఆపరేషన్ ఉచితంగా చేస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ

బ్రహ్మసముద్రం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ కోనాపురం గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కలశ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.